

APTEL/26/A4813

# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త

సంపుటి : 01 సంచిక :47 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ మంగళవారం - 25 - ఆగష్టు - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad




## 22ఏ బాధితులకు న్యాయం చేసి తీరుతాం..

భయపడాల్సిన అవసరం లేదు వాళ్లకు డబ్బులు వాపస్




- అబద్ధాలతో ప్రతిపక్షం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుంది
- ప్లాట్ల బుకింగ్ కోసం డబ్బులు చెల్లించిన వారికి నగదు వెనక్కి ఇస్తాం
- ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరు పనిచేయడం లేదని బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు చేస్తోంది
- క్యూర్ ప్రాంతంలోని రైతుల సమస్యలను చర్చించాం

హైదరాబాద్: ప్రస్తుతం హైదరాబాద్ కోర్‌లో 22ఏ అంశం ఎంతో జఠిలంగా మారిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ అన్నారు. మిగతా 2 లో

## 19 ఏళ్ల కేరళ యువతి సంచలనం.. మిస్ యూనివర్స్ ఇండియా 2026 కిరీటం



- 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి కిరీటం సొంతం
- నవంబర్‌లో ప్యూర్టోరికోలో భారత్‌కు ప్రాతినిధ్యం
- మూడేళ్లుగా ఈ కిరీటం కోసం కష్టపడ్డానన్న కజియా
- భారత్‌కు మిస్ యూనివర్స్ కిరీటం తేవడమే లక్ష్యమని వెల్లడి
- వైష్ణవి గణేష్ తొలి రన్నరప్‌గా ఎంపిక మిగతా 2 లో

## రైతులే పారిశ్రామికవేత్తలు కావాలి.. గొర్మే పాప్‌కార్న్ ఒక విప్లవం




- ★ దేశంలో తొలి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ విత్తనాన్ని అభివృద్ధి చేసిన గోర్మే సంస్థ
- ★ 11 ఏళ్లలో 69% మార్కెట్ వాటాతో గోర్మే అద్భుత విజయం సాధించిందన్న సీఎం
- ★ రైతులను పారిశ్రామికవేత్తలుగా చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం
- ★ ఫుడ్ ప్రాసెసింగ్‌పై యువత దృష్టి పెట్టాలని చంద్రబాబు పిలుపు

అమరావతి: వ్యవసాయాన్ని కేవలం జీవనోపాధిగా కాకుండా ఒక ఆర్థిక శక్తిగా చూడాలని, రైతులను పారిశ్రామికవేత్తలుగా మార్చాలన్నదే తమ ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దేశంలోనే మొట్టమొదటి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని అభివృద్ధి చేసిన 'గొర్మే పాప్‌కార్నికా' సంస్థ ఒక వినూత్న విప్లవానికి శ్రీకారం చుట్టిందని ఆయన కొనియాడారు. మిగతా 2 లో

# ఏలూరులో ఉపరాష్ట్రపతితో కలిసి కొత్తరకం పాప్‌కార్న్ సీడ్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

### ఉపరాష్ట్రపతి, సీఎం చేతుల మీదుగా నాన్-జీఎంవో పాప్‌కార్న్ విత్తనం ఆవిష్కరణ

- ఏలూరు జిల్లా ముసునూరులో ఆసియాలోనే అతిపెద్ద ప్రాసెసింగ్ యూనిట్
- 'గోర్మే పాప్‌కార్నికా' ఆధ్వర్యంలో దేశంలోనే తొలి నూతన వంగడం విడుదల
- ఈ కార్యక్రమానికి హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్, ఇతర ప్రముఖులు
- వేలాది మంది రైతులతో ఒప్పందాలు కుదుర్చుకుని పాప్‌కార్న్ సాగుకు ప్రోత్సాహం




అమరావతి: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ఏలూరు జిల్లా, ముసునూరు మండలంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి చంద్రబాబు సంయుక్తంగా కీలక ఆవిష్కరణ చేశారు. దేశంలోనే తొలిసారిగా అభివృద్ధి చేసిన నాన్-జీఎంవో (జన్యుపరమైన మార్పులు లేని) పాప్‌కార్న్ మెయిజ్ హైబ్రిడ్ విత్తనాన్ని మిగతా 2 లో

## కాకినాడ బీచ్‌లో యువకుల గల్లంతు.. గాలింపు ముమ్మరం చేయాలన్న పవన్ కల్యాణ్




- కాకినాడ బీచ్‌లో సముద్ర స్నానానికి వెళ్లి ఇద్దరు యువకులు గల్లంతు
- ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని జిల్లా ఎస్పీకి ఆదేశాలు జారీ
- ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన మరో ఇద్దరు యువకులు

## నాడు తిరుమలను కాపాడుకున్నాం, ఇప్పుడు శబరిమల కోసం పోరాడదాం

### విజయవాడలో జరిగిన అయ్యప్ప గురుస్వాముల రాష్ట్ర సమ్మేళనం

పీవీఎన్ మాధవ్

- హిందూ ధర్మంపై నాస్తికులు దాడి చేస్తున్నారన్న ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్
- శబరిమల పవిత్రతను కాపాడటానికి పోరాడాలని పిలుపు
- అయ్యప్ప భక్తుల సమస్యల పరిష్కారానికి టీటీడీ కృషి చేస్తుందని హామీ




అమరావతి: హిందూ ధర్మం, దేవాలయ వ్యవస్థలను నాశనం చేసేందుకు పెద్ద కుట్ర జరుగుతోందని, శబరిమల పవిత్రతను కాపాడటానికి అయ్యప్ప భక్తులు, మిగతా 2 లో

## శ్రావణమాసం మూడో శుక్రవారం కొత్త పార్టీని ప్రకటిస్తా: విజయసాయిరెడ్డి



- పార్టీ పేరు, జెండా, విధివిధానాలపై క్లారిటీ ఇచ్చిన విజయసాయిరెడ్డి
- విజయవాడ వేదికగా పూర్తి వివరాలను వెల్లడిస్తానన్న విజయసాయి
- ప్రజల గొంతుక వినిపించేందుకు ప్రతిపక్ష హోదా అక్కర్లేదని వ్యాఖ్య వివరాలు 2 లో

## 2027 సంక్రాంతి నుంచి 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' అమలు

### విజయ్ సర్కార్ భారీ ప్రకటనలు.. ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు

- ఏడాదికి 3 ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించనున్న తమిళనాడు ప్రభుత్వం
- రూ.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు పథకం వర్తింపు
- మహిళలకు ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం
- ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించిన విజయ్



తమిళనాడు: తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సోమవారం పలు కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు. ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించే పథకంతో పాటు మిగతా 2 లో

## రేవంత్‌తో భట్టి అత్యవసర భేటీ.. కొండా సురేఖ అంశంపైనే ప్రధాన చర్చ?



- రేవంత్‌రెడ్డితో భట్టి విక్రమార్క అత్యవసర భేటీ
- కొండా సురేఖ వ్యాఖ్యలపై ప్రధానంగా చర్చ
- వివాదాల ప్రభావంపై నేతల సమీక్ష
- తదుపరి చర్యలపై సమాలోచనలు
- పాలన, శాఖల పనితీరుపైనా చర్చ

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో వరుస పరిణామాల వేళ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మిగతా 2 లో

# ఆక్స్‌ఫర్డ్‌తో తెలంగాణ ఒప్పందం చేసుకోనుంది

### నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను కేంద్రం అవమానించింది

- ★ అమెరికా పర్యటనకు అనుమతిపై రేవంత్ తీవ్ర ఆగ్రహం
- ★ ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్య
- ★ విదేశాల్లో స్పందిస్తే దేశద్రోహి అనేవారని వెల్లడి
- ★ అమెరికాకు తెలంగాణ అధికారులను పంపినట్లు ప్రకటన



హైదరాబాద్: అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తనకు జరిగిన అవమానం కాదని.. మిగతా 2 లో

## 'నా అమెరికా పర్యటన రద్దు.. తెలంగాణ ప్రజలకే అవమానం'



- 'వికసిత్ భారత్' ప్రణాళికలో భాగంగానే మేము 'తెలంగాణ రైజింగ్ 2047'ను ప్రకటించాం

హైదరాబాద్: గుజరాత్ ముఖ్యమంత్రి విదేశీ పర్యటనకు అనుమతి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం.. నా పర్యటనకు మాత్రం ఎందుకు అనుమతి ఇవ్వలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై ఆయన సోమవారం తెలంగాణ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా నా విదేశీ పర్యటనకు కేంద్ర ప్రభుత్వం మిగతా 2 లో

## 3 లక్షల మంది రష్యా కొత్త సైనికులు.. యుద్ధంలో రష్యా భారీ సన్నాహాలు: జెలెన్‌స్కీ

ఢిల్లీ: ఉక్రెయిన్-రష్యా మధ్య పోరు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్న వేళ, ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ కీలక వ్యాఖ్యలు చేశారు. తమపై విరుచుకుపడేందుకు రష్యా పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తోందని, అందులో భాగంగా కొత్తగా దాదాపు 3 లక్షల మంది సైనికులను సమీకరించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తోందని ఆయన ఆరోపించారు. డొనెట్స్క్ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకోవడమే లక్ష్యంగా మాస్కో అడుగులు వేస్తోందని జెలెన్‌స్కీ తెలిపారు. సెప్టెంబరులో రష్యా పార్లమెంటరీ ఎన్నికలు ముగిసిన అనంతరం ఈ కొత్త బలగాల సమీకరణ ప్రక్రియ ఊపందుకుంటుందని అన్నారు. ఈ ఏడాది ఆరంభం నుంచి రష్యా పెద్ద సంఖ్యలో సైనికులను కోల్పోయినప్పటికీ, తన ఆయుధ సంపత్తిని భారీగా పెంచుకుంటోందని చెప్పారు. రష్యా ప్రస్తుతం ఏటా సుమారు 1,300 బాలిస్టిక్ క్షిపణులను తయారు చేసే స్థాయికి చేరుకుందని ఆరోపించారు. యుద్ధానికి ముగింపు పలికే దిశగా వచ్చే వేసవి కాలం నాటికి శాంతి చర్చలు జరిగే అవకాశం ఉండవచ్చని జెలెన్‌స్కీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## పాక్ ఆర్మీ చీఫ్‌పై మౌలానా ఫైర్.. 1971 ఓటమిని గుర్తుచేస్తూ తీవ్ర విమర్శలు

ఢిల్లీ: పాకిస్థాన్ సైన్యంపై ఆ దేశంలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జమియత్ ఉలేమా-ఎ-ఇస్లాం (జేయూఐ-ఎఫ్) చీఫ్ మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్, ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌పై ఘాటు విమర్శలు గుప్పించారు. 1971 యుద్ధంలో పాకిస్థాన్ ఎదుర్కొన్న పరాభవాన్ని గుర్తుచేస్తూ, సైన్యం తీరును ఆయన తూర్పారబట్టారు. పెషావర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఫజ్లుర్ రెహ్మాన్ మాట్లాడుతూ, దేశంలో నిరంతర అణచివేత, రక్తపాతం కొనసాగితే నూతన భౌగోళిక సరిహద్దులు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సామాన్య ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే, సైన్యం ప్రగల్భాలు పలకడం ఎంతమాత్రం సరికాదని ఆయన మండిపడ్డారు. 1971 యుద్ధానికి ముందు నాటి ఆర్మీ చీఫ్ యాహ్యా ఖాన్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. “మేము శత్రువులతో పర్వతాల్లో, ఎడారుల్లో, వీధుల్లో పోరాడతాం. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు” అని యాహ్యా ఖాన్ నాడు అన్నారని, కానీ చివరకు పాకిస్థాన్ సైన్యం ఘోర పరాజయాన్ని మూటగట్టుకుందని రెహ్మాన్ ఎద్దేవా చేశారు. భారత్‌తో కేవలం 13 రోజుల పాటు జరిగిన ఆ యుద్ధం ఫలితంగానే బంగ్లాదేశ్ ఆవిర్భవించిందని, 1971 డిసెంబర్ 16న సుమారు 93,000 మంది పాకిస్థాన్ సైనికులు భారత దళాల ఎదుట లొంగిపోయారని ఆయన గుర్తుచేశారు. నాటి పరిస్థితులకు, నేటికీ పెద్దగా వ్యత్యాసం లేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే సైన్యం సంబరాలు చేసుకోవడం భావ్యం కాదని ఫజ్లుర్ రెహ్మాన్ అభిప్రాయపడ్డారు.

## శ్రావణమాసం మూడో శుక్రవారం కొత్త పార్టీని ప్రకటిస్తా: విజయసాయిరెడ్డి

అమరావతి: తాను కొత్త పార్టీని ప్రారంభించపోతున్నట్టు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ విషయానికి సంబంధించి ఆయన ఈరోజు మరింత క్లారిటీ ఇచ్చారు. శ్రావణమాసం మూడో శుక్రవారం నాడు తన నూతన రాజకీయ పార్టీకి సంబంధించిన పేరు, జెండా, విధివిధానాలు మరియు పూర్తి ప్రణాళికను విజయవాడ వేదికగా అధికారికంగా వెల్లడిస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై పోరాడేందుకు, ప్రజల తరపున గొంతుక వినిపించేందుకు చట్టసభల్లో ప్రత్యేకంగా ప్రతిపక్ష హోదా ఏమీ అవసరం లేదని విజయసాయి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ మాత్రమే ఏకైక ప్రతిపక్షంగా ఉందని పేర్కొన్నారు. సాధారణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వారి సమస్యలను నేరుగా సభల వరకు తీసుకెళ్లేందుకు ఒక బలమైన స్వతంత్ర రాజకీయ వేదికను ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

## కాకినాడ బీచ్‌లో యువకుల గల్లంతు.. గాలింపు ముమ్మరం చేయాలన్న పవన్ కల్యాణ్

అమరావతి: తూర్పు గోదావరి జిల్లా కాకినాడ సమీపంలోని సముద్ర తీరంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సరదాగా సముద్ర స్నానానికి వెళ్లిన నలుగురు యువకుల్లో ఇద్దరు భారీ అలల ఉధృతికి గల్లంతయ్యారు. మరో ఇద్దరు ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డారు. గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి, ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ఆయన జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలను తక్షణమే ముమ్మరం చేయాలని ఆదేశించారు. గజ ఈతగాళ్లు, ప్రత్యేక రెస్క్యూ బృందాలతో పాటు మెరైన్ పోలీసులు, కోస్ట్ గార్డ్, స్థానిక మత్స్యకారుల సహాయాన్ని కూడా తీసుకోవాలని సూచించారు.

అసలేం జరిగిందంటే.. కాకినాడ గ్రామీణ మండలం సూర్యారావుపేట పరిధిలోని ఎన్టీఆర్ బీచ్ వద్ద ఆదివారం సాయంత్రం ఈ దుర్ఘటన జరిగింది. చీడిగ గ్రామానికి చెందిన కవల సోదరులు అనసూరి వీరబాబు, శ్రీగణేశ్ సాయిరామ్.. తమ స్నేహితులైన పడాల యువకిశోర్ (ఇంద్రపాలెం), కాదా ఆదిత్య వెంకట సందీప్ కుమార్‌తో కలిసి సముద్ర స్నానానికి వెళ్లారు. వీరంతా స్నానం చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన పెద్ద కెరటం వీరబాబు, యువకిశోర్‌ను సముద్రంలోకి లాక్కెళ్లింది. ప్రమాదాన్ని గమనించిన బీటెక్ విద్యార్థి శ్రీగణేశ్ సాయిరామ్, మరో ఇంటర్ విద్యార్థి సందీప్ కుమార్ సురక్షితంగా బయటపడ్డారు. వారిని స్థానికులు హుటాహుటిన కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. గల్లంతైన వారిలో ఒకరు కవల సోదరుడు కావడంతో వారి కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రస్తుతం పోలీసులు, సహాయక బృందాలు సముద్రంలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. బాధితుల కుటుంబాలకు అందుబాటులో ఉండి, వారికి ధైర్యం చెప్పాలని, సహాయక చర్యల వివరాలను ఎప్పటికప్పుడు అందించాలని స్థానిక శాసనసభ్యులు పంతం నానాజీకి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

## కాంగ్రెస్‌కు కొండా ఫ్యామిలీ షాక్?.. జనసేన గూటికి సుస్మిత?

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర ప్రచారం ఒకటి ఊపందుకుంది. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత త్వరలో జనసేన పార్టీలో చేరబోతున్నారంటూ వార్తలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత వివాదాల నేపథ్యంలో ఆమె ఈ నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారని, జనసేన నేతలతో చర్చలు కూడా జరుగుతున్నాయని రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో కొండా ఫ్యామిలీకి, కాంగ్రెస్ అధిష్ఠానానికి మధ్య దూరం పెరిగిన విషయం తెలిసిందే. ముఖ్యంగా పరకాల అసెంబ్లీ టికెట్‌ను ఆశిస్తున్న సుస్మిత, తనకు అవకాశం ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ప్రకటించారు. అంతేకాకుండా సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర దుమారం రేపాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. దీనిపై ఆమె పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి వివరణ ఇచ్చినట్లు సమాచారం. ఇలాంటి తరుణంలోనే సుస్మిత జనసేన వైపు చూస్తున్నారని, ఆ పార్టీ నేతలతో మంతనాలు జరుపుతున్నారని ప్రచారం జరుగుతోంది. తెలంగాణలో పార్టీని విస్తరించే పనిలో ఉన్న జనసేన, ఆమె చేరికకు సానుకూలంగానే ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా వైద్యారోగ్య శాఖ మాజీ డైరెక్టర్ గడల శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం ఆ పార్టీ విస్తరణ వ్యూహాలకు బలం చేకూరుస్తోంది. అయితే, ఈ ప్రచారంపై కొండా సుస్మిత వైపు నుంచి గానీ, జనసేన పార్టీ నుంచి గానీ ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాంగ్రెస్‌లో అంతర్గత వివాదం ముదురుతున్న నేపథ్యంలో జరుగుతున్న ఈ ప్రచారం రాజకీయంగా తీవ్ర ఆసక్తిని రేపుతోంది.

## చంద్రబాబు నిజమైన జాతీయవాది.. అభివృద్ధిని ఆటంకపరచరు: ఉపరాష్ట్రపతి ప్రశంసలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక నిజమైన జాతీయవాది అని, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కొనియాడారు. ఆయన జాతీయవాదం రాష్ట్ర ప్రగతికి ఏమాత్రం అడ్డురాదని, ఇదే ఆయనలోని గొప్పతనమని ప్రశంసించారు. ఏలూరు జిల్లా ముసునూరులో జరిగిన నాన్-జీఎంఓ హై ఎక్స్‌పాన్షన్ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తన ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ చంద్రబాబు పాలనా దక్షతపై ప్రశంసల జల్లు కురిపించారు. ముసునూరు గ్రామాన్ని ఒక విజయగాథగా తీర్చిదిద్దినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం తనకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమైందని, ఎందుకంటే ఇది భారతీయ రైతుల పురోగతికి సంబంధించినదని ఉపరాష్ట్రపతి అన్నారు. తన ప్రసంగంలో ఒక ఆసక్తికరమైన అనుభవాన్ని పంచుకున్నారు. “రెండు నెలల క్రితం ‘దినమలర్’ అనే తమిళ పత్రికలో మొక్కజొన్న పరిశ్రమలో పారిశ్రామికవేత్త పట్టాభి రామారావు సాధించిన అసాధారణ విజయాల గురించి చదివాను. ఒకే ఒక్క వ్యవసాయ ఉత్పత్తిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ఆయన స్ఫూర్తిదాయక ప్రస్థానం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. వెంటనే ఆయనకు అభినందనలు తెలుపుతూ ఒక లేఖ రాశాను” అని వివరించారు. ఆ తర్వాత పట్టాభి రామారావు తనను కలిసి పాప్‌కార్న్‌ను బహుకరించారని గుర్తుచేసుకున్నారు. ఈ ఘటన తర్వాత జరిగిన ఒక యాదృచ్ఛిక సంఘటనను ఉపరాష్ట్రపతి సభతో పంచుకున్నారు. కొద్దిరోజులకే ఉపరాష్ట్రపతి భవన్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశం జరిగిందని, ఆ సమావేశంలో పట్టాభి ఇచ్చిన పాప్‌కార్న్‌ను అందరికీ అందించానని తెలిపారు. ఒక భారతీయ రైతు వ్యవస్థాపక శక్తిని, ఆయన పండించిన ఉత్పత్తి సత్తాను చాటిచెప్పడానికే ఈ ఉదాహరణను చెబుతున్నానని రాధాకృష్ణన్ అన్నారు. రైతులే ఈ దేశానికి వెన్నెముక అని ఆయన పునరుద్ఘాటించారు. జీడీపీ, అభివృద్ధి గురించి మనం మాట్లాడక ముందే తరతరాలుగా ఈ నాగరికతకు అన్నం పెట్టింది రైతేనని అన్నారు. “మన పండుగలు, పంచాంగాలు, కాలగమన భావన సైతం విత్తనం వేయడం నుంచి పంట కోయడం వరకు సాగిన వ్యవసాయ చక్రం ఆధారంగానే రూపుదిద్దుకున్నాయి. జనవరి 14న దేశమంతటా ఆంధ్రప్రదేశ్‌లో మకర సంక్రాంతి, పంజాబ్‌లో లోహ్రీ, తమిళనాడులో పొంగల్, అసోంలో బిహు అంటూ పంటల పండుగను జరుపుకుంటాం. ఇంతటి వైవిధ్యభరితమైన మన దేశాన్ని వ్యవసాయం ఏకం చేస్తోంది” అని ఆయన వివరించారు. ప్రస్తుత ధరల ప్రకారం దేశ స్థూల విలువ జోడింపులో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా దాదాపు ఐదో వంతు ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కోర్టెవా పాప్‌కార్నికా ఎండీ ఎస్పీబీ పట్టాభి రామారావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# రైతులే పారిశ్రామికవేత్తలు కావాలి.. గౌర్మే పాప్‌కార్న్ ఒక విప్లవం

మొదటి పేజీ తరువాయి

ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌తో కలిసి నూజివీడు సమీపంలోని ముసునూరులో జరిగిన గౌర్మే సంస్థ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు, కొత్తరకం పాప్ కార్న్ సీడ్ ను ఆవిష్కరించారు. సంస్థ విజయగాథను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళతామని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, “ఒకప్పుడు మన దేశంలో అమ్ముడైన ప్రతి పాప్‌కార్న్ గింజపై మనం ఖర్చు చేసిన డబ్బులో 70 శాతానికి పైగా బ్రెజిల్, అర్జెంటీనా వంటి దేశాలకు వెళ్లేది. కానీ, గౌర్మే సంస్థ కృషితో ఇప్పుడు ఆ 70 శాతం ఆదాయం మన దేశ రైతులకే దక్కుతోంది. కేవలం 11 ఏళ్లలో ఈ సంస్థ దేశానికి 125 మిలియన్ అమెరికన్ డాలర్ల (దాదాపు రూ.1000 కోట్లకు పైగా) విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసింది. ఇది మనందరికీ గర్వకారణం” అని ప్రశంసించారు. 2014లో ప్రారంభమైన ఈ సంస్థ, నేడు ఆసియాలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ కేంద్రంగా ఎదగడం, 8 రాష్ట్రాల్లో 17,500 మంది రైతులతో 40,000 ఎకరాల్లో సాగు చేస్తూ దేశంలోని 3,400 సినిమా థియేటర్లకు పాప్‌కార్న్‌ను సరఫరా చేయడం అసాధారణ విజయమని కొనియాడారు. సంస్థ ఎండీ పట్టాభిరామారావు గారి కుటుంబానికి వ్యాపార దక్షత, రైతులను ఆదుకునే వారసత్వం ఉన్నాయని గుర్తుచేశారు. వ్యవసాయ రంగంలో విలువ జోడింపు (ఖుశ్రీబవాూాంసఎఅశీఅ) ప్రాధాన్యతను వివరిస్తూ, “ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా, అరటి, మామిడి, మిరప, పసుపు, పామాయిల్ వంటి ఎన్నో వాణిజ్య పంటలు పండుతున్నాయి. అయితే,




వాటిని ప్రాసెస్ చేసి, బ్రాండ్ సృష్టించి అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లినప్పుడే రైతు రాజుగా ఎదుగుతాడు. గౌర్మే సంస్థ పొలం నుంచి వినియోగదారుడి వరకు ట్రేసబిలిటీతో ఒక పక్కా వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇదే మోడల్‌ను రాష్ట్రంలోని ఇతర పంటలకు కూడా వర్తింపజేయాలి” అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

ప్రస్తుతం రాష్ట్రం నుంచి ఎగుమతి అవుతున్న ఆక్వా ఉత్పత్తుల్లో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెస్ అవుతోందని, దీనిని 60-70 శాతానికి పెంచగలిగితే ఉపాధి అవకాశాలు, విదేశీ మారక ద్రవ్యం భారీగా పెరుగుతాయని విశ్లేషించారు. రాష్ట్రంలో నీటి భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. “ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో 52 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. అయినప్పటికీ, గతంలో నిర్మించిన పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి రైతులను కొంతవరకు ఆదుకోగలిగాం. నూజివీడు ప్రాంత భవిష్యత్తును మార్చే చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును న్యాయపరమైన అడ్డంకులు తొలగించి త్వరలోనే పూర్తి చేస్తాం. దశాబ్దాల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ఈ ఆగస్టు 31న జాతికి అంకితం చేస్తున్నాం. పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నీటిని అందిస్తున్నాం” అని చంద్రబాబు వివరించారు. దేశంలోని నదుల అనుసంధానం ఆవశ్యకతను నొక్కిచెబుతూ, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఈ ఆశయానికి మద్దతునివ్వడం అభినందనీయమన్నారు. “గోదావరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, కావేరి నదులను అనుసంధానిస్తే నాలుగు దక్షిణాది రాష్ట్రాల నీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయి. ఇదే స్ఫూర్తితో గంగ-బ్రహ్మపుత్ర నదుల నీటిని కూడా సద్వినియోగం చేసుకోగలిగితే దేశ భవిష్యత్తు అప్రతిహతంగా ముందుకు సాగుతుంది” అని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, పది మందికి ఉద్యోగాలు ఇచ్చే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. టెక్నాలజీని వ్యవసాయంతో అనుసంధానించి ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోకి వస్తే ఆకాశమే హద్దుగా రాణించవచ్చని సూచించారు. గౌర్మే సంస్థ చూపిన ‘అవుట్ ఆఫ్ బాక్స్’ ఆలోచనా విధానం రాష్ట్రంలోని యువతకు స్ఫూర్తిదాయకమని, ఇలాంటి వినూత్న స్టార్టప్‌లకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## ‘నా అమెరికా పర్యటన రద్దు.. తెలంగాణ ప్రజలకే అవమానం’

మొదటి పేజీ తరువాయి

నా విదేశీ పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడం సరైనది కాదు. ఈ వైఖరిని అందరూ తప్పుబడుతున్నారు. ‘వికసిత్ భారత్’ ప్రణాళికలో భాగంగానే మేము ‘తెలంగాణ రైజింగ్ 2047’ను ప్రకటించాం. ముఖ్యంగా విద్యా, క్రీడా రంగాలలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ పర్యటనను తలపెట్టాం. లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చిన కేంద్రం, అమెరికా వెళ్లేందుకు మాత్రం నిరాకరించింది. అమెరికా పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించలేదనే కారణంతోనే కేంద్రం అనుమతి నిరాకరించిందంటూ బీజేపీ నేతలు చేస్తున్న ప్రచారంలో నిజం లేదు. కొందరు బీజేపీ నేతలు కావాలనే కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారు. నేను లండన్, అమెరికా పర్యటనల పూర్తి వివరాలను కేంద్ర ప్రభుత్వానికి ముందుగానే అందించా. కేంద్రం కేవలం రాజకీయ కారణాలతోనే నా అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించింది. నా పర్యటనను అడ్డుకోవడం అంటే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల్ని అవమానించడమే. కేంద్రం నిర్ణయాన్ని తెలంగాణ ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలి. ఇది నాకు జరిగిన అవమానం కాదు.. తెలంగాణ జరిగిన అవమానం. తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష చూపిస్తోంది. ఈ వివక్షను సహించేది లేదు. పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తాం. తెలంగాణ బీజేపీ ఎంపీలకు అభివృద్ధి అవసరం లేదా?. కేంద్రం తీరు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. ఒక రాష్ట్ర సీఎం పర్యటనను అడ్డుకోవడం ఆషామాషీ కాదు. నా పర్యటనను అడ్డుకోవచ్చు. కానీ ఆలోచనను కాదు. సీఎం పర్యటనను అడ్డుకోవడం అంటే తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. విదేశాల్లో ఉండి మాట్లాడితే దేశ ద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి మాట్లాడుతున్నా' అని వ్యాఖ్యానించారు.

## రేవంత్‌తో భట్టి అత్యవసర భేటీ.. కొండా సురేఖ అంశంపైనే ప్రధాన చర్చ?

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో వరుస పరిణామాల వేళ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అత్యవసరంగా సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలతో పాటు మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు, వాటి తర్వాత చోటుచేసుకున్న పరిణామాలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. కొన్ని రోజులుగా వివాదాస్పద అంశాలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఈ వ్యవహారాలు కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠపై చూపుతున్న ప్రభావంపైనా ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. కొండా సురేఖ అంశంలో ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సమాలోచనలు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారానికి ఎలా ముగింపు పలకాలి? పార్టీపై ప్రభావం పడకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి? అనే అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పాలనాపరమైన అంశాలు, వివిధ శాఖల పనితీరుపైనా సమావేశంలో చర్చించినట్లు సమాచారం. రాబోయే రోజుల్లో ప్రభుత్వం అనుసరించాల్సిన రాజకీయ వ్యూహంపైనా ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి భేటీకి ప్రాధాన్యం ఏర్పడటంతో కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. సమావేశం తర్వాత ఎలాంటి నిర్ణయాలు వెలువడతాయన్న దానిపై ఆసక్తి నెలకొంది.

## 2027 సంక్రాంతి నుంచి ‘అన్నపూర్ణి సూపర్ సిక్స్’ అమలు

తమిళనాడు: తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సోమవారం పలు కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు. ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించే పథకంతో పాటు ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. ‘అన్నపూర్ణి సూపర్ సిక్స్’ పేరుతో గ్యాస్ సిలిండర్ల పథకం అమల్లోకి రానుంది. 2027 సంక్రాంతి నుంచి దీనిని ప్రారంభించనున్నారు. ఏటా రూ.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. అర్హులైన కుటుంబాలు కొనుగోలు చేసే మూడు గ్యాస్ సిలిండర్ల ఖర్చును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఈ పథకానికి ఏటా సుమారు రూ.4,000 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులతో గ్యాస్ కొరత, ధరల పెరుగుదల కుటుంబాలపై అదనపు భారాన్ని మోపాయని విజయ్ తెలిపారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం పరిధిని ప్రభుత్వం విస్తరించింది. ఇకపై సాధారణ బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్, ఎల్ఎస్ఎస్, డీలక్స్ బస్సుల్లోనూ మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. జిల్లాల మధ్య నడిచే బస్సుల్లోనూ ఈ సదుపాయం కల్పించనున్నారు. ‘వెట్రి పయనం’ పేరుతో అక్టోబర్ 2 నుంచి ఈ విస్తరణ అమల్లోకి వస్తుంది. ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు విజయ్ ప్రకటించారు. చెన్నై సమీపంలోని పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టుపై విజయ్ మరోసారి తన వ్యతిరేకతను స్పష్టం చేశారు. ప్రాజెక్టుతో ప్రభావితమయ్యే కుటుంబాల పక్షాన నిలుస్తామని చెప్పారు. ప్రత్యామ్నాయ ప్రాంతాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుత మీనంబాక్కం, చెన్నై విమానాశ్రయంలోని కొత్త టెర్మినల్-5 నిర్మించనున్నట్లు కూడా ప్రకటించారు.

## 22ఏ బాధితులకు న్యాయం చేసి తీరుతాం..

హైదరాబాద్: ప్రస్తుతం హైదరాబాద్ కోర్‌లో 22ఏ అంశం ఎంతో జఠిలంగా మారిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ అన్నారు. 22ఏ బాధితులకు ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లో న్యాయం చేసి తీరుతుందన్నారు. హైదరాబాద్‌లో (సోమవారం) ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. అబద్ధాలతో ప్రతిపక్షం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని.. ఈ అంశంలో ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని మంత్రి తేల్చిచెప్పారు. మంత్రి మాట్లాడుతూ.. ప్లాట్ల బుకింగ్ కోసం డబ్బులు చెల్లించిన వారికి నగదు వెనక్కి ఇస్తాం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరు పనిచేయడం లేదని బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు చేస్తోంది. ఇప్పటివరకూ ఆ నంబర్‌కు వేలాదిగా కాల్స్ వచ్చాయి. క్యూర్ ప్రాంతంలోని రైతుల సమస్యలను చర్చించాం. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్లు చేస్తాం. ఫాస్ట్ ట్రాక్‌లో రిజిస్ట్రేషన్లు చేస్తాం. అని మంత్రి అన్నారు.

### సెక్షన్ 22ఏ సమస్య ఏంటి?

రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22ఏ ప్రకారం ప్రభుత్వ భూములు, దేవాదాయ, వక్ఫ్ ఆస్తులు, అసైన్డ్ భూములు, భూదాన భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. అయితే ఇటీవల ప్రభుత్వం తీసుకవచ్చిన ‘భూ భారతి’లో 2026 ఏప్రిల్‌లో రెవెన్యూ శాఖ నిషేధిత ఆస్తుల జాబితాను నవీకరించింది. ఈ ప్రక్రియలో అధికారులు సరైన పరిశీలన లేకుండానే జాబితాలను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపారు. ఒకే సర్వే నంబర్‌లో కొంత భాగం ప్రభుత్వ భూమి ఉంటే, ఆ సర్వే నంబర్‌లోని మొత్తం ప్రైవేట్ పట్టా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చడంతో ఈ గందరగోళం తలెత్తింది.

### భయపడాల్సిన అవసరం లేదు వాళ్లకు డబ్బులు వాపస్

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఈ సమస్య తీవ్రత అధికంగా ఉంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ఖరీదైన ప్రాంతాలతో పాటు, దశాబ్దాల క్రితం హుడా, హెచ్ఎండీఏ అనుమతులతో ఏర్పడిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు కూడా ఈ జాబితాలో చేరాయి. రిజిస్ట్రేషన్ కోసం వెళ్లినప్పుడే తమ ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నాయని యజమానులకు తెలియడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

## ఆక్స్‌ఫర్డ్‌తో తెలంగాణ ఒప్పందం చేసుకోనుంది

హైదరాబాద్: అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తనకు జరిగిన అవమానం కాదని.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానమని అన్నారు. కేంద్రం తీరు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని విమర్శించారు. బ్రిటన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. బ్రిటన్ పర్యటనకు అనుమతించారని, కానీ అమెరికా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వలేదన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్‌తో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నామని చెప్పారు. తన పర్యటనలో ఎలాంటి దాపరికం లేదని స్పష్టం చేశారు. ఏదైనా దాపరికం ఉందని విదేశాంగ శాఖ భావిస్తే అందుకు కారణాలను స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. విదేశాల్లో ఉన్నప్పుడే ఈ అంశంపై స్పందిస్తే తనను దేశద్రోహి అంటారని రేవంత్ అన్నారు. అందుకే భారత్‌కు తిరిగొచ్చిన తర్వాత స్పందిస్తున్నానని చెప్పారు. తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడమే తన పర్యటన ఉద్దేశమని తెలిపారు. అమెరికా పర్యటనకు తాను వెళ్లలేకపోయినా రాష్ట్ర అధికారులు అక్కడికి వెళ్లారని రేవంత్ చెప్పారు. పెట్టుబడులు, అంతర్జాతీయ సంస్థలతో సంబంధాల విషయంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకోబోతున్నామని తెలిపారు. గుజరాత్ సీఎంకు విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తున్నారని రేవంత్ అన్నారు. తెలంగాణ సీఎంకు మాత్రం ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇది వివక్షకు నిదర్శనమని ఆరోపించారు. గుజరాత్ గుత్తాధిపత్యానికి ఇదే ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడాన్ని అడ్డుకోవడమే కేంద్రం నిర్ణయం ఉద్దేశమని రేవంత్ విమర్శించారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు గుజరాత్‌కు మద్దతు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధి బీజేపీ ఎంపీలకు అవసరం లేదా అని నిలదీశారు.

## నాడు తిరుమలను కాపాడుకున్నాం, ఇప్పుడు శబరిమల కోసం పోరాడదాం: పీవీఎన్ మాధవ్

అమరావతి: హిందూ ధర్మం, దేవాలయ వ్యవస్థలను నాశనం చేసేందుకు పెద్ద కుట్ర జరుగుతోందని, శబరిమల పవిత్రతను కాపాడటానికి అయ్యప్ప భక్తులు, హిందూ సమాజం నడుం బిగించాలని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం జరిగిన అయ్యప్ప గురుస్వాముల రాష్ట్ర సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, నాస్తికులు, కొందరు అన్యమతస్థులు హిందూ ధర్మంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. గతంలో తిరుమలలో ఏడుకొండలను రెండు కొండలుగా మార్చేందుకు, ఆచారాలను మార్చేందుకు ప్రయత్నాలు జరిగాయని గుర్తు చేశారు. అప్పుడు హిందూ సమాజం పోరాడి తిరుమల పవిత్రతను కాపాడుకుందని, అదే స్ఫూర్తితో ఇప్పుడు శబరిమల రక్షణకు కూడా పోరాడాలన్నారు. “స్వామియే శరణమయ్యప్ప అంటూనే, ధర్మాన్ని నాశనం చేసే శక్తుల పీచమణిచేందుకు కూడా సిద్ధం కావాలి” అని ఆయన ఉద్బోధించారు. ఈ సమావేశంలో పాల్గొన్న టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. అయ్యప్ప భక్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కేరళలోని ప్రభుత్వం మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని విమర్శించారు. గతంలో టీటీడీ నిధులపై జరిగిన చర్చను ప్రస్తావిస్తూ, “వెంకటేశ్వర స్వామి వడ్డీ కాసుల వాడే కానీ, వడ్డీ వ్యాపారి కాదు” అని తాను అధికారులకు స్పష్టం చేసినట్లు తెలిపారు. టీటీడీ చట్టం ప్రకారం ఇతర దేవాలయాల్లో అన్నప్రసాదం అందించేందుకు అవకాశం ఉందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేలా మాధవ్‌తో చర్చిస్తామన్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో భక్తులు లేవనెత్తిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఇది కేవలం అయ్యప్ప భక్తుల సమస్య కాదని, యావత్ హిందువుల సమస్యగా భావించి పరిష్కారం కోసం కలిసికట్టుగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఏలూరులో ఉపరాష్ట్రపతితో కలిసి కొత్తరకం పాప్‌కార్న్ సీడ్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ఏలూరు జిల్లా, ముసునూరు మండలంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి చంద్రబాబు సంయుక్తంగా కీలక ఆవిష్కరణ చేశారు. దేశంలోనే తొలిసారిగా అభివృద్ధి చేసిన నాన్-జీఎంవో (జన్యుపరమైన మార్పులు లేని) పాప్‌కార్న్ మెయిజ్ హైబ్రిడ్ విత్తనాన్ని వారు లాంఛనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యవసాయ రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు విచ్చేసిన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు ముసునూరు మండలం కాత్రేనిపాడు వద్ద ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌లు ఉపరాష్ట్రపతిని సాదరంగా ఆహ్వానించి వేదిక వద్దకు తోడ్కొని వెళ్లారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా విచ్చేశారు. ‘గౌర్మే పాప్‌కార్నికా’ సంస్థ ఆధ్వర్యంలో ఈ నూతన హైబ్రిడ్ వంగడాన్ని అభివృద్ధి చేశారు. ఇదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాప్‌కార్న్ ప్రాసెసింగ్ యూనిట్, ఆసియా ఖండంలోనే అతిపెద్ద ప్రాసెసింగ్ కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందడం విశేషం. ఈ సంస్థ ఇప్పటికే దేశవ్యాప్తంగా వేలాది మంది రైతులతో ఒప్పందాలు కుదుర్చుకుని, వేల ఎకరాల్లో పాప్‌కార్న్ సాగును ప్రోత్సహిస్తోంది. దేశంలోని అనేక మల్టీప్లెక్స్‌లు, సినిమా థియేటర్లకు పాప్‌కార్న్ సరఫరా చేయడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సందర్భంగా, వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు. నాన్-జీఎంవో వంటి ఆరోగ్యకరమైన ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఏపీ రైతులకు మంచి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నూతన ఆవిష్కరణ స్థానిక రైతులకు గొప్ప వరం కానుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## 19 ఏళ్ల కేరళ యువతి సంచలనం.. మిస్ యూనివర్స్ ఇండియా 2026 కిరీటం




ఢిల్లీ: కేరళకు చెందిన 19 ఏళ్ల కజియా లిజ్ మెజో ‘మిస్ యూనివర్స్ ఇండియా 2026’ కిరీటం దక్కించుకుంది. జైపూర్‌లోని జీ స్టూడియోస్‌లో ఆదివారం జరిగిన గ్రాండ్ ఫినాలేలో ఆమె విజేతగా నిలిచింది. దేశవ్యాప్తంగా పోటీపడిన 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి టైటిల్ సొంతం చేసుకుంది. మిస్ యూనివర్స్ ఇండియా 2025 విజేత మానికా విశ్వకర్మ ఆమెకు కిరీటం అలంకరించారు. దీంతో నవంబర్‌లో ప్యూర్టోరికోలో జరిగే 75వ మిస్ యూనివర్స్ పోటీలో భారత్ తరపున కజియా ప్రాతినిధ్యం వహించనుంది. కిరీటం దక్కిన అనంతరం కజియా ఆనందం వ్యక్తం చేసింది. ఈ కిరీటం కోసం మూడేళ్లకు పైగా కష్టపడ్డానని తెలిపింది. తన సొంత రాష్ట్రం కేరళకు ఈ విజయాన్ని తీసుకెళ్లడం ఎంతో గర్వంగా ఉందని చెప్పింది. 19 ఏళ్ల వయసులో ఇంత పెద్ద వేదికపై నిలవడానికి ఎంతో ధైర్యం అవసరమైందని కజియా పేర్కొంది. తనపై తనకు నమ్మకం పెంచుకోవడం అతిపెద్ద సవాలుగా భావించానని తెలిపింది. భారత్‌కు మిస్ యూనివర్స్ కిరీటం తీసుకురావడమే తన తొలి లక్ష్యమని కజియా చెప్పింది. తాను చేసే ప్రతి పనిలో భారత్, కేరళకు ప్రాతినిధ్యం వహించాలనుకుంటున్నట్లు తెలిపింది. విజేతను ఎంపిక చేసిన జడ్జింగ్ ప్యానెల్‌లో మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్, ఉర్వశి రౌతేలా, రియా సింఘా, పర్యావరణవేత్త ప్రగ్యా కపూర్ ఉన్నారు. సెలీనా జైట్లీ కూడా జడ్జిగా వ్యవహరించారు. వైష్ణవి గణేశ్ తొలి రన్నరప్‌గా నిలిచింది. ఆమెకు మిస్ ఇంటర్నేషనల్ ఇండియా 2026 టైటిల్ దక్కింది. అనుశ్రీ సాతవ్లేకర్ రెండో రన్నరప్‌గా నిలిచింది. తేజస్విని శ్రీవాస్తవ మూడో రన్నరప్, అనుభా వశిష్ఠ్ చౌదరి నాలుగో రన్నరప్‌గా నిలిచారు.

# అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్



బాపట్ల జిల్లా ఆగస్టు 24 : పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను చట్టపరిదిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎస్పీ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల సమస్యలను విని, వారు అందజేసిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. కుటుంబ కలహాలు, భర్త, అత్తింటి వేధింపులు, స్థల వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు తదితర పలు సమస్యలపై పిర్యాదు దారులు అర్జీలు అందజేశారు. పోలీస్ స్టేషన్, పోలీస్ కార్యాలయాలకు వచ్చే ఫిర్యాదీదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ గారు పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖ చట్టపరిధిలో పరిష్కరించడానికి సాధ్యంకాని అర్జీల పరిష్కారం కోసం సంప్రదించ వలసిన సంబంధిత శాఖ అధికారుల వివరాలను అర్జీదారులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.సుధాకర్ , సీసీఎస్ డిఎస్పీ పి.జగదీష్ నాయక్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ఎస్.ఐ లక్ష్మి రాజ్యం తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ




గుంటూరు జిల్లా ఆగస్టు 24 : జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బా ధ్ య తా య ు ు త ం గా వ్యవహరించి, ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ తో పాటు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, డీఆర్వో ఖాజావలి, డి పి ఓ సాయికుమార్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ నిర్వహించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక క్యూ లైన్లు, తాగునీటి సదుపాయం, ఉచిత భోజన ఏర్పాట్లు కల్పించింది. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు, అర్జీదారులకు అవసరమైన ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అనాథ మృతదేహానికి గౌరవప్రదంగా అంత్యక్రియలు

## పోలీసుల సమాచారంతో ముందుకొచ్చిన అవర్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా ప్రతినిధి పిల్లి గోవిందరాజు



విశాఖపట్నం, ఆగష్టు 24, : టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిసరాల్లో సుమారు 50 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించి, పోస్టుమార్టం అనంతరం కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు.మృతుడికి బంధువులు ఎవరూ లేకపోవడంతో సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ మన్మథరావు, హెడ్ కానిస్టేబుల్ అప్పికొండ కన్నారావు అవర్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా ప్రతినిధి పిల్లి గోవిందరాజుకు సమాచారం అందించారు. దీంతో స్పందించిన గోవిందరాజు, అవర్ హ్యాండ్స్ సంస్థ సొంత నిధులతో మృతదేహాన్ని మార్చురీ నుంచి తరలించి, కన్వెంట్ కూడలి జంక్షన్ దహనవాటికలో గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు.

# ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎం ఆర్ పౌల్ట్రీ కన్స్ట్రక్షన్ కార్యాలయం ప్రారంభం




పలమనేరు ఆగస్టు 24 : ఎం.ఆర్ పౌల్ట్రీ కన్ స్ట్రక్షన్స్ కార్యాలయాన్ని పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి సోమవారం ప్రారంభించారు. పట్టణంలోని లక్ష్మి నగర్ కాలనీకి చెందిన ఎం.ఆర్ పౌల్ట్రీ కన్ స్ట్రక్షన్స్ ప్రోపరేటర్ బి. రమేష్ బాబు ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన పూజలలో ఆయన పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేయగా వారు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, తెలుగుదేశం పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం గౌడ్,చాంద్ బాషా, నాగరాజు, ఖాజా, మదన్,శ్రీధర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయానికి రెండు గ్రాముల

# బంగారు మాంగళ్యం వితరణ



పలమనేరు ఆగస్టు 24 : పలమనేరు పట్టణంలో అత్యంత ప్రతిష్టగాంచిన కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం సోమవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. అనంతరం గంగవరం మండలంలోని తెల్ల గుండ్లపల్లి గ్రామానికి చెందిన గంగాధరం గిరిజ మొగిలి అమ్మ రెండవ శ్రావణ సందర్భంగా స్వామివారికి వెండి కళ్ళను వెండి విభూది పట్టి, అమ్మవారికి రెండు గ్రాముల బంగారు మాంగళ్యమును దాతలు అందజేశారు. దాతలను ఆలయ చైర్మన్ మురళీకృష్ణ, పట్టణ అధ్యక్షులు కుట్టి, అర్చకులు, శివాలయం డైరెక్టర్లు ఘనంగా వారిని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మురళీకృష్ణ, పట్టణ అధ్యక్షులు ఆర్.బి.సి కుట్టి, సుజాత లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండాలని స్పష్టం చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



బాపట్ల జిల్లా ఆగస్టు 24 : అధికారులు విధులను అంకితభావంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ హాల్ నందు ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, జిల్లాలోని వివిధ మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల యొక్క సమస్యలను వింటూ, వారి సమస్యలకు అక్కడికక్కడే పరిష్కరిస్తూ, మరికొన్నింటిని సంబంధిత అధికారులకు అందజేసి వాటికి పరిష్కార మార్గం చూపాలని ఆయన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నాణ్యతతో పనిచేయాలని ఆయన చెప్పారు. అర్జీదారుని దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్థం చేసుకొని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్జీదారునికి పరిష్కార మార్గం చూపాలన్నారు. సమస్య పరిష్కారములో అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. అర్జీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈరోజు మొత్తం 127 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. గడిచిన వారంలో ప్రజా సమస్యల పరిష్కారంలో అత్యుత్తమ సేవలు అందించిన , చీరాల,దేవాంగపురి - 1, స్వర్ణ గ్రామంలో సంక్షేమ మరియు విద్యా సహాయకురాలిగా పనిచేస్తున్న కులకల సౌందర్య ను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఘనంగా సత్కరించి, శాలువ కప్పి, జ్ఞాపికను అందజేసి అభినందించారు. అర్జీల పరిష్కారంలో సౌందర్య ఏ విధమైన చర్యలు తీసుకున్నారో, వాటి గురించి కలెక్టర్ సౌందర్యను ప్రశ్నించారు. సౌందర్య సమస్యల పరిష్కారంలో తీసుకున్న చర్యలను కలెక్టర్ కు వివరించారు. ఆమె యొక్క స్పూర్తితో జిల్లా అధికారులందరూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో నిర్వహిస్తున్న సంక్లిప్త ఓటర్ సవరణ జాబితా ప్రక్రియ, పంచాయితీ, జడ్పిటిసి ఎంపీటీసీ, పురపాలక సంఘ ఎన్నికల ప్రక్రియ పై సంబంధిత మండల స్థాయి అధికారులతో వీక్షణ సమావేశం ద్వారా సమీక్షించారు. ఎస్ ఐ ఆర్ కు సంబంధించి నోటీసులు జారీలో పెండింగ్ వివరాలపై మండలాల వారీగా సంబంధిత అధికారులను ఆయన ఆరా తీశారు. బాపట్ల మండలంలో ఇప్పటికీ చాలామంది బిఎల్వోలు హియరింగ్ ప్రక్రియ మొదలు పెట్టలేదని ఆయన చెప్పారు. ఇందుగల కారణాలపై ఆయన బాపట్ల ఆర్డిఓ ను ఆరా తీశారు. ఏ ఈ ఆర్ ఓ వారీగా ఆయన హియరింగ్ నిర్వహణపై ఆరా తీశారు. ప్రణాళిక ప్రకారం రోజుకు 250 మందిని హియరింగ్ నిర్వహించి వాటిని పూర్తి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు వారి మండలాల్లో నిర్వహించే ఎన్నికల విధులపై దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించి ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కార్యాలయంలో ఫైళ్ల తొలగింపు పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి అధికారులకు తెలిపారు. ఫైళ్ల తొలగింపులో బాగా చేసిన అధికారులను ఆయన అభినందించారు. బాగా చేయని వారిని అందుగల కారణాలపై ఆయన ఆరా తీశారు. అధికారులు వారి కార్యాలయ స్థాయిలోని ఫైళ్ల తొలగింపు మాత్రమే చేస్తున్నారని, జిల్లాలో వారి పరిధిలోని ఇతర కార్యాలయాలలో ఫైళ్ల తొలగింపు సరిగా నిర్వహించడం లేదని ఆయన అన్నారు. ప్రతివారం ఒకరోజు జిల్లా అధికారుల కార్యాలయాలను తనిఖీ నిర్వహించి వారి కార్యాలయ పనితీరును పరిశీలన చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. సెప్టెంబర్ మూడవ తేదీన మెప్మా మరియు బాపట్ల పురపాలక సంఘ ఆధ్వర్యంలో లోన్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి తెలిపారు. ఈ సందర్భంగా లోన్ మేళ గోడ ప్రతులను ఆయన విడుదల చేశారు. అర్హులైన వారందరికీ లోన్లు మంజూరు చేయాలని సంబంధిత అధికారులకు ఆయన తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి వివిధ ప్రతిభావంతుల సమస్యలను ఆలకించి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారుల లవన్న, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, ఇతర జిల్లా అధికారులు, వీక్షణ సమావేశం ద్వారా రెవెన్యూ డివిజనల్ అధికారులు, అన్ని మండల స్థాయి అధికారులు, ఏ ఈ ఆర్ వో లు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మాఫియా డాన్ జగన్...వైసీపీ అంటేనే దొంగల ముఠా

## మద్యం అక్రమాలతో ప్రజల సొమ్ము దోపిడీ

## వైసీపీని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలి

## గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు ఆగస్టు 24 : మద్యం అక్రమాల వంటి దురాగతాలతో దొంగలు ముఠా నాయకుడిగా జగన్ ఎదిగారని, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దీనికి నిదర్శనమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ విమర్శించారు. రాష్ట్రంలో మద్యం విక్రయాల విషయంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్టు వైసీపీకి చెంపపెట్టు అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ పత్రిక ప్రకటనలో విమర్శించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో మద్యం పాలసీని అడ్డుపెట్టుకుని వేల కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారని విమర్శించారు. ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ డిపోల నుంచి మద్యం దుకాణాలకు సరుకు రవాణాలోనూ అక్రమాలలకు ఒడిగట్టారన్నారు. మద్యం విక్రయాలలో ఇష్టరీతిగా వ్యవహరించి ప్రజల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. కల్తీ మద్యాన్ని సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. గంజాయి బ్యాచ్ ని ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో అరాచకాలకు పాల్పడ్డారన్నారు. ఇలాంటి నాయకులు కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మద్యం అక్రమాల ద్వారా వచ్చిన డబ్బు తాడేపల్లి ప్యాలెస్ కు చేరిందని ఆరోపించారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం నుంచి పరిశ్రమలు పారిపోయాయని, విద్యార్థుల జీవితాలను సర్వనాశనం చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం తీసుకొచ్చారని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశయంలో భాగంగా యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నామని, గత వైసిపి పాలనలో యువత భవితను గంజాయి మత్తులో నాశనం చేశారని మండిపడ్డారు. వైసీపీని రాష్ట్రం నుంచి ప్రజలు తరిమికొట్టే రోజులు ముందున్నాయని చెప్పారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రత్యేక- మున్సిపల్ కమిషనర్ లోకేష్ వర్మ




పలమనేరు ఆగస్టు 24 : విస్తృత సవరణ (ఎస్ఐఆర్)--2026 కార్యక్రమంలో భాగంగా చిత్తూరు జిల్లాలోని పలమనేరు పురపాలక సంఘముకు సంబంధించి సోమవారం స్థానిక టీఎస్ అగ్రహారం సచివాలయము పరిధిలోనిపోలింగ్ బూత్-280,281,282,290,291 మరియు 292 కు సంబందించిన బూత్ లెవల్ ఆఫీసర్స్ ( బి ఎల్ వో ) బూత్ లెవల్ అసిస్టెంట్స్ ( బి ఎల్ ఎ ) లతో సమీక్షా సమావేశము నిర్వహించినారు. మరియు నోటీసు పొందిన ఓటర్స్ తో ఎన్యూమరేషన్ ఫారాల్లో తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వయస్సు వ్యత్యాసం తదితర లాజికల్ ఎర్రర్ అనామలిస్ (తార్కిక దోషాలు) కలిగివున్న ఓటర్లకు కూడా నోటీసులు పంపనున్నారు.ఇలా 11 రకాల దోషాలకు సంబంధించి ఓటర్లు తగిన రుజువులను సమర్పించి వారి ఓటు ను తిరిగి పొందవలసినదిగా కోరినారు. ఈ సందర్భంగా పలమనేరు మున్సిపల్ కమీషనర్ లోకేష్ వర్మ మాట్లాడుతూ.... ఇటీవల పలమనేరు పురపాలక సంఘ పరిధిలో చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో 42,580 మంది ఓటర్లలో 35,610 మంది వివరాలను డిజిటలైజ్ చేయడం జరిగిందని మిగిలిన అర్హులైన ఓటర్లు కూడా తప్పనిసరిగా తమ పేర్లు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా చూసుకోవాలని తెలిపారు. ఓటర్ల జాబితా మరింత పారదర్శకంగా ఖచ్చితంగా ఉండేందుకు ప్రజల భాగస్వామ్యంతో పాటు రాజకీయ పార్టీల సహకారం కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజా సామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో రాజకీయ పార్టీ ఎన్నికల యంత్రాంగం పరస్పర సమన్వయంతో పనిచేయడం ఎంతో అవసరమని తెలిపారు. ప్రజల నుంచి జూలై 31 నుంచి ఆగస్టు 30, 2026 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించబడతాయని వాటిపై సెప్టెంబర్ 28, 2026 లోపు విచారణ పూర్తిచేసి, అక్టోబర్ 3 2026న తుది ఓటర్ల జాబితా ప్రచురించబడుతుందని తెలిపారు.ముసాయిదా ఓటర్ల జాబితాలు పలమనేరు పురపాలక సంఘములోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారుల వద్ద ప్రజల పరిశీలన కోసం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.6,970 నీ పేర్లను ఆన్ కలెక్టబుల్గా గుర్తించి తొలగించనున్నారు.ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు కోసం ఫారం--6, పేరు తొలగింపు లేదా అభ్యంతరాల కోసం ఫారం--7 సవరణలు లేదా ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరొకదానికి పేరు మార్పు కోసం ఫారం--8 ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. అయితే బల్క్ రూపంలో ఫారాలు ఇవ్వడం లేదా స్వీకరించడం ఉండదని స్పష్టం చేశారు.బూత్ లెవల్ అధికారులు నిర్ణీత గడువులో ప్రజల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించి విచారణ పూర్తి చేస్తారని, రాజకీయ పార్టీలచే నియమితులైన బూత్ లెవల్ ఏజెంట్లు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా సహకరించాలని కోరారు.అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, అవసరమైన మార్పులు, చేర్పులు ఉంటే గడువులోగా ఫారం--6, 7, 8 ద్వారా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీ కే .లోకేశ్వర వర్మ, సహాయ ఎన్నికల అధికారి ఛ కమీషనర్, పలమనేరు పురపాలక సంఘము వారు విజ్ఞప్తి చేశారు. పలమనేరు పురపాలక సంఘ కార్యాలయము నందు ప్రతి సోమవారము నిర్వహించు ప్రజాసమస్యల పరిష్కార వేదిక పి జి ఆర్ ఎస్ కార్యక్రమమునకు సంబంధించి తేది 24.082026 న పబ్లిక్ హెల్త్ సెక్షన్ -4 ఇంజనీరింగ్ సెక్షన్-1 మొత్తము 4 అర్జీలు మున్సిపల్ కమీషనర్ వారు స్వీకరించి పరిష్కారానికై సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేసినారు.

# ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



బాపట్ల జిల్లా ఆగస్టు 24 : ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. జిల్లా పరిశ్రమల ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ సమావేశం సోమవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన వనరుల లభ్యతపై నివేదిక సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ ఉత్పత్తులు, పర్యాటక రంగ ప్రాంతాలలో పరిశ్రమల స్థాపనకు అనుకూలతపై నివేదిక ఇవ్వాలన్నారు. నూతనంగా పరిశ్రమల స్థాపన, పరిశ్రమల పునరుద్ధరణ కొరకు నమోదైన దరఖాస్తులను వేగంగా అనుమతులు ఇవ్వాలన్నారు. 34 యూనిట్లకు గాను, 31 యూనిట్లకు వివిధ శాఖల నుండి సింగల్ డెస్క్ పాలసీ ద్వారా అనుమతులు జారీ చేశామన్నారు. మిగిలిన యూనిట్లకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఫ్యాక్టరీస్ డిపార్ట్మెంట్ వారిని ఆదేశించారు. ఏపీ పారిశ్రామిక అభివృద్ధి విధానము 2024-29 ద్వారా జిల్లా పరిశ్రమల శాఖ నుండి ఎనిమిది యూనిట్లకు రూ.92లక్షల రాయితీలు మంజూరు కొరకు చేసిన సిఫార్స్ లను కలెక్టర్ ఆమోదించారు. తద్వారా 65 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఏపీఐఐసీ ద్వారా భూముల కేటాయింపు పరిశ్రమల స్థాపన పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాణిజ్య పన్నుల శాఖ ద్వారా ఏడాదిలో రూ.17.3 కోట్లు వసూలు అయ్యిందని కలెక్టర్ చెప్పారు. ప్రొఫెషనల్ పన్నుల కింద రూ.65.30 లక్షలు వసూలు చేశామన్నారు. బాపట్ల, చీరాల డివిజన్ కింద జి ఎస్ టి వసూలు లక్ష్యాలను చేరుకోవడంపై అధికారులను కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో కన్వీనర్ జిల్లా పరిశ్రమల అధికారి వై.రామకృష్ణ, వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమీషనర్ కనికిరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ శివ కృష్ణ, నాబార్డ్ డిడిఎం జె. రవి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ ఆర్. త్రినాథరావు, డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎం. సువర్ణ ఫణి, జిల్లా టూరిజం అధికారి కె. బెనహర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలులో శబ్ద కాలుష్యంపై
# ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్..

- 55 వాహనాలపై ఎంవీఐ చట్టం ప్రకారం ఈ-చలాన్లు..



కర్నూలు, ఆగస్టు 24 : కర్నూలు నగరంలో శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం ఓల్డ్ పీసీఆర్ సర్కిల్ పరిసర ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టారు.తనిఖీల్లో అధిక శబ్దం చేస్తున్న 5 మోడిఫైడ్ సైలెన్సర్లతో ఉన్న ద్విచక్ర వాహనాలను గుర్తించారు.వాటి సైలెన్సర్లను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దం వచ్చే హారన్లు వినియోగి స్తున్న 50 ఆటోలను గుర్తించి, హారన్లను తొలగించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన మొత్తం 55 వాహనాలపై ఎంవీఐ చట్టం ప్రకారం ఈ-చలాన్లు విధించినట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ మాట్లాడుతూ పాఠశాలలు,ఆసుపత్రులు,నివాస ప్రాంతాల్లో అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వాహనదారులు మోడిఫైడ్ సైలెన్సర్లు,అధిక శబ్దం చేసే హారన్లను వినియోగించకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు.



## సాగు, తాగునీటి సమస్యలపై
# మంత్రి నిమ్మలతో ఎమ్మెల్యే బివి

జయనాగేశ్వర రెడ్డి చర్చలు...



ఎమ్మిగనూరు: ఆగస్టు 24 : కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి శ్రీ నిమ్మల రామానాయుడు ఎమ్మిగనూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహానికి విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే డా.బి.వి.జయనాగేశ్వర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయంగా మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని సాగునీరు, తాగునీటి అవసరాలు,పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులు,నీటి వనరుల అభివృద్ధి తదితర అంశాలపై మంత్రి నిమ్మల రామానాయుడుతో ఎమ్మెల్యే చర్చించారు. నియోజకవర్గంలోని రైతులకు సాగునీరు,ప్రతి గ్రామానికి తాగునీరు అందించేలా చేపట్టాల్సిన చర్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.అనంతరం నియోజకవర్గంలో కొనసాగుతున్న 'రెండేళ్ల కూటమి ప్రభుత్వం -- నమ్మకం,అభివృద్ధి,సంక్షేమం' ఇంటింటి ప్రచారం,ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రస్తుత స్థితిగతులపై ఇరువురు చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు నియోజకవర్గంలోని నీటి ప్రాజెక్టులు,ప్రజల అవసరాలపై సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో సాగునీటి శాఖ పర్యవేక్షణ ఇంజినీర్,ఎల్ఎల్‌సీ డివిజన్ ఇంజినీర్,అధికారులు,సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సమయంలో
## ఇచ్చిన హామీలను అమలు చేయాలి



తుగ్గలి, ఆగస్టు 24 : టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నబిరసూల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ అనుబంధం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిపిఐ మండల కార్యదర్శి కామ్రేడ్ సయ్యద్ సుల్తాన్ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి నాగరాజు సమక్షంలో పార్టీ శ్రేణులతో పాటు రైతులతో కలిసి సోమవారం మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరుతూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ రవికి అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హులైన నిరుపేదల మూడు సెంట్లు అలాగే పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హులైన నిరుపేదలకు రెండు సెంట్లు ప్రకారం ఇల్లు నిర్మించుకునేందుకు స్థలాలు కేటాయించి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని అలాగే అర్హులైన వారందరికీ వృద్ధాప్య వితంతు వికలాంగుల పింఛన్లు ఇవ్వాలని వీబీ-జీ-రామ్-జీ ఉపాధి పథకాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా అమలు చేయాలని గ్రామాలలో వలసల నివారణ కోసం తక్షణమే ఉపాధి పనులు చేపట్టాలని అలాగే ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని వారికి 200 రోజుల ఉపాధి పని దినాలను కల్పించాలని జిల్లాలో కరువు విళయతాండం చేస్తున్న నేపథ్యంలో వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.10,000 కరువు పింఛన్ ఇవ్వాలని అలాగే వ్యవసాయ భూములకు సంబంధించి ఫ్రీహోల్డ్, 22ఏ నిబంధనలు తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు హనుమేష్, అలాగే మహబూబ్ బాషా, నబిసాబ్, మద్దిలేటి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పంటలకు ప్రాణం పోసిన సాగునీరు..!!

- ఎమ్మెల్యే ఎమ్మెల్యే డా.బి.వి.జయనాగేశ్వర రెడ్డి కీలక చర్య..
- ఎర్రకోట కాలువకు సాగునీరు..
- 2,800 ఎకరాలకు సాగునీటి ప్రయోజనం..



ఎమ్మిగనూరు, ఆగస్టు 24 : ఎమ్మిగనూరు నియోజకవర్గ రైతులకు అండగా ఎమ్మెల్యే డా.బి.వి.జయనాగేశ్వర రెడ్డి మరో కీలక ముందడుగు వేశారు.ఎమ్మిగనూరు మండలం ఎర్రకోట గ్రామంలో ఎం.ఎస్.పీ.మిట్ట సోమాపురం 1ఆర్ కాలువకు సాగునీటిని విడుదల చేశారు.ఎల్‌నినో ప్రభావం,వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు కాలువకు నీటి విడుదలతో ఊరట లభించింది.ఈ కాలువ ద్వారా సుమారు 2,800 ఎకరాలకు సాగునీరు అందనున్నట్లు అధికారులు తెలిపారు.ఇప్పటికే పంటలు సాగు చేసిన రైతులకు నీరు అందడంతో వాటిని కాపాడుకునే అవకాశం ఏర్పడింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బి.వి.జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అవసరమైన సమయంలో సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని విమర్శించారు.రైతుల పంటలను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు."వైసీపీ పాలనలో రైతులు నీటి కోసం ఎదురుచూశారు..కూటమి ప్రభుత్వంలో రైతుల పంటలను కాపాడేందుకు నీటిని విడుదల చేస్తున్నాం.రైతులకు అవసరమైన సమయంలో సాగునీరు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం" అని పేర్కొన్నారు.ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని మాజీ ఎమ్మెల్యేకు సంబంధించిన ఆయకట్టు ప్రాంతాలకు కూడా ఎలాంటి రాజకీయ వివక్ష లేకుండా సాగునీరు అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.ప్రజలు ఏ పార్టీకి చెందిన వారైనా రైతు రైతేనని, ప్రతి రైతుకు నీరు అందించాలనే విధానంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.కాలువకు నీరు విడుదల కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్ఎల్‌సీ డీఈ,ఏఈ,వైస్ చైర్మన్,వాటర్ యూజర్స్ అసోసియేషన్ సభ్యులు, ఏఎంసీ చైర్మన్,టీడీపీ మండల అధ్యక్షులు,పార్టీ నాయకులు,ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.







# ఆస్తి పై మోజు కన్నతల్లి పై కపట ప్రేమ ఆస్తి కాజేసిన కన్న కూతురు..!

అక్రమ రిజిస్ట్రేషన్ కు సహకరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి..!

మతిస్థిమితం సరిగా లేని తల్లితో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న కూతురు..!

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి 8 మందికి సమాన హక్కు కల్పించాలని కలెక్టరేట్ లో బాధితుల ఫిర్యాదు..!




గోనెగండ్ల ఆగస్టు 24 : కర్నూలు జిల్లా గోనెగండ్లలో అక్రమంగా భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న నూరాబిపై చర్యలు తీసుకోవాలని బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం కర్నూలు కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. వివరాలకు వెళితే గోనెగండ్ల గ్రామానికి చెందిన కీర్తిశేషులు మాబురెడ్డి, అజ్జూబీ దంపతులకు కుమారులు లేరు 8 మంది కుమార్తెల,సంతానమే తల్లికి వారసత్వంగా వచ్చిన మూడు ఎకరాల 32 సెంట్లు భూమిని, 8 మందికి కూతుళ్లకు సమానంగా పంచాలని పెద్దలు సమక్షంలో నిర్ణయించారని తెలిపారు. ఆస్తిపై అప్పటికే కన్నేసిన ఐదవ కుమార్తె నూరాబి మొత్తం భూమిని ఆక్రమించుకోవాలని అవకాశం కోసం ఎదురుచూస్తున్న ఆమె, ఆస్తి మీద మోజుతో, తల్లిపై కపట ప్రేమతో, తల్లి ని బాగోగులు తానే చూసుకుంటానని, మిగతా అక్క చెల్లలను నమ్మించి,ఇంటికి తీసుకెళ్లి, మతిస్థిమితం సరిగా లేని తల్లితో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుందని ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న తోటి అక్క చెల్లెలు ఎనిమిది మందికి ఆస్తిలో సమాన హక్కు ఉంటుందని, ఎవరికి తెలియకుండా ఎలా అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకుంటావని, మిగతా 7 గురు అక్కచెల్లల్లు నిలదీయగా వారిపై నానా దుర్భాషలాడుతోందని బాధిత సోదరిలు వాపోయారు. ఆస్తి పంపకాలు అన్నదమ్ములు విభాగాలు చేసుకోవాలంటే, తల్లితండ్రికి సంబంధించిన వారసులు, వారసురాలు ఎంతమంది ఉన్నారో ఫ్యామిలీ సర్టిఫికెట్లు, కావాలని అడిగే రెవెన్యూ సిబ్బంది. ఇలాంటివి సర్టిఫికెట్లు అడగకుండా అక్రమ రిజిస్ట్రేషన్ కి ఎలా సహకరించారని, దీనికి సహకరించిన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకుని, అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి న్యాయం చేయాలని కలెక్టర్ ను కోరిన బాధితులు




# పబ్లిక్ గ్రీవెన్స్‌కు 95 ఫిర్యాదులు.. - చట్టపరంగా న్యాయం చేస్తాం...

- కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్..

కర్నూలు :ఆగస్టు 24: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు.కర్నూలు కొత్తపేటలోని కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమానికి మొత్తం 95 ఫిర్యాదులు అందాయి.

ముఖ్యమైన ఫిర్యాదులు:

1. హైదరాబాద్‌లో ఐటీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి సల్మాన్ అనే వ్యక్తి రూ.3.60 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు వన్‌టౌన్‌కు చెందిన ప్రకాష్ నాయక్ ఫిర్యాదు చేశారు. 2.రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు రూ.10 లక్షలకు బంగారం ఇస్తామని నమ్మించి, శాంపిల్స్ చూపించి డబ్బులు తీసుకున్న అనంతరం నకిలీ బంగారం ఇచ్చి మోసం చేశారని ఆదోనికి చెందిన తాహేర్ భాషా ఫిర్యాదు చేశారు. 3.జెప్ట ఫ్రాంఛైజీ పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు మెయిల్ పంపి,ప్రాసెసింగ్ ఫీజు,అడ్వాన్స్,స్టోర్ విజిట్ తదితర పేర్లతో విడతల వారీగా రూ.9.15 లక్షలు తీసుకుని మోసం చేశారని ఆదోని హనుమాన్ నగర్‌కు చెందిన సతీష్ ఫిర్యాదు చేశారు. 4.ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.లక్ష తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కల్లూరు మండలం దూపాడుకు చెందిన జస్వంత్ ఫిర్యాదు చేశారు. 5.స్మాల్ ఫైనాన్స్ పేరుతో తక్కువ వడ్డీకి రుణం ఇస్తామని చెప్పి రూ.6 లక్షల రుణం ఇచ్చారని,మిగిలిన మొత్తాన్ని చెల్లించలేకపోవడంతో ఇంటిని సీజ్ చేసి వేలం వేస్తున్నారని,చెల్లింపునకు గడువు ఇప్పించి న్యాయం చేయాలని ఓర్వకల్లు మండలం ఉప్పలపాడుకు చెందిన ఆవుల పుల్లయ్య ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ప్రతి ఫిర్యాదుపై త్వరితగతిన స్పందించి, చట్టపరంగా విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా, సీఐలు శివశంకర్, పార్థసారథి, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.



# ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ.. ప్రపంచ మార్కెట్లే లక్ష్యం

: సీఎం చంద్రబాబు

దేశీయ పాప్‌కార్న్ విత్తనాలను ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి, సీఎం

ఫుడ్ ప్రాసెసింగ్‌తో వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు

ఆంధ్రా పాప్‌కార్న్, అరకు కాఫీలను గ్లోబల్ బ్రాండ్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చేందుకు భారీ ప్రణాళిక

నదుల అనుసంధానంతో నీటి భద్రత సాధిస్తామన్న చంద్రబాబు



అమరావతి: వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా విలువ జోడించి, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియతో ఉత్పత్తుల విలువ పెరిగి, రైతులకు ప్రయోజనం కలగడమే కాకుండా రాష్ట్రంలో సంపద సృష్టి జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఏలూరు జిల్లా ముసునూరు వద్ద ఏర్పాటు చేసిన 'గార్మే పాప్ కార్నికా' నాన్-జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం దేశంలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. "రైతులపై ఉన్న ప్రేమతో ఉపరాష్ట్రపతి ఏలూరు జిల్లాకు వచ్చి జన్యుమార్పిడి చేయని మొక్కజొన్న విత్తనాలను ఆవిష్కరించారు. గార్మే పాప్ కార్న్ సంస్థ మన దేశీయ నేలపైనే రైతులతో కలిసి నాన్-జీఎంఓ విత్తనాలను ఉత్పత్తి చేయడం అభినందనీయం. నూజివీడు గడ్డపై పండిన ఈ పాప్‌కార్న్ దేశవిదేశాలకు ఎగుమతి కావడం గర్వకారణం" అని అన్నారు. 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తూ, దేశీయ పాప్‌కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉండటంపై గార్మే సంస్థను ఆయన ప్రశంసించారు. ఇప్పటివరకు పాప్‌కార్న్ కోసం బ్రెజిల్ వంటి దేశాలపై ఆధారపడ్డామని, ఇకపై ఆ సంపద మన దేశంలోనే ఉంటుందని తెలిపారు.

గ్లోబల్ బ్రాండ్లుగా మన ఉత్పత్తులు

"ఆంధ్రా పాప్‌కార్న్, అరకు కాఫీ, కోస్తా కోకో వంటివి ప్రపంచ ప్రసిద్ధి చెందిన బ్రాండ్లుగా మారాలి. రైల్వే స్టేషన్లలోనూ వీటి కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. కొండపల్లి కొయ్యబొమ్మల వంటి స్వదేశీ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు చేరాలి. కేంద్ర, రాష్ట్రాల్లోని ఎన్డీఏ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా, రైతులను పారిశ్రామికవేత్తలుగా చూస్తున్నాయి. పసుపు, మిరప, ఆక్వా ఉత్పత్తులకు విలువ జోడించి ఎగుమతి చేయడమే మా లక్ష్యం" అని చంద్రబాబు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 10 శాతం ఉత్పత్తులు మాత్రమే ప్రాసెస్ అవుతున్నాయని, ఈ శాతాన్ని పెంచడం ద్వారా అధిక సంపదను ఆర్జించవచ్చని అన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలని, ముఖ్యంగా యువత ఈ రంగంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

### రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జల భద్రతే కీలకం

రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికల గురించి వివరిస్తూ.. "రాయలసీమను ఉద్యాన పంటల హబ్‌గా మార్చేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో సీమను అభివృద్ధి చేస్తాం. రూ.35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం" అని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నెలాఖరులో వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు నీరందిస్తామన్నారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి పంటలను కాపాడామని గుర్తుచేశారు. చింతలపూడి ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత భవిష్యత్తు మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నదుల అనుసంధానం జరగాలన్నది ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచన అని ముఖ్యమంత్రి తెలిపారు. "గోదావరి-కృష్ణా, తుంగభద్ర, పెన్నా-కావేరీ నదుల అనుసంధానంతో 4 రాష్ట్రాల్లో నీటి సమస్యలు తీరతాయి. గంగ, మహానది, గోదావరి నదులను కూడా కలిపితే వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోవచ్చు. నీటి భద్రత సాధిస్తే దేశాభివృద్ధి అన్‌స్టాపబుల్" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, కె. అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక

సంపాదకీయం

# రాత్రి పూట త్వరగా భోజనం చేయాలని చెబుతున్న సైంటిస్టులు.. ఎందుకో తెలిస్తే మీరు కూడా అలాగే చేస్తారు..

పూర్వం ప్రజలు రోజూ శారీరక శ్రమ చేసే వారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను కలిగి ఉండేవారు. రోజూ బలవర్ధకమైన ఆహారం తినేవారు. అంతేకాదు రాత్రి పూట త్వరగా భోజనం చేసేవారు. త్వరగా నిద్రించేవారు. ఉదయం త్వరగా నిద్రలేచేవారు. ఇలా అన్ని రకాలుగా వారు ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించేవారు. కనుకనే ఎన్నో ఏళ్ల పాటు వారు ఆరోగ్యంగా జీవించగలిగారు. అయితే అప్పట్లో ప్రజలు అంత ఆరోగ్యంగా ఉండడానికి కారణం పౌష్టికాహారం తీసుకోవడం మాత్రమే కాకుండా రాత్రి పూట త్వరగా భోజనం చేయడమే అని చెప్పవచ్చు. సైంటిస్టులు ఈ విషయంపై అధ్యయనాలు కూడా చేపట్టి వాస్తవమే అని తేల్చారు. ఈ క్రమంలోనే రాత్రి పూట త్వరగా భోజనం చేయాలని, దీని వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని సూచిస్తున్నారు.

**బరువు తగ్గేందుకు..**

రాత్రి పూట త్వరగా భోజనం చేయడం వల్ల అనేక వ్యాధులు, అనారోగ్య సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. భోజనాన్ని కనీసం రాత్రి 7.30 గంటల లోపు ముగించాల్సి ఉంటుంది. రాత్రి పూట త్వరగా భోజనం చేయడం వల్ల శరీర మెటబాలిజం మెరుగు పడుతుంది. దీంతో క్యాలరీలు సులభంగా ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనుకునే వారు కచ్చితంగా రాత్రి పూట త్వరగా భోజనం చేయాలి. దీని వల్ల మనం తిన్న ఆహారం నుంచి వచ్చే శక్తిని ఖర్చు పెట్టేందుకు శరీరానికి తగిన సమయం లభిస్తుంది. దీంతో క్యాలరీలు సులభంగా ఖర్చవుతాయి. కొవ్వు కరిగి అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలని చూస్తున్నవారు తప్పనిసరిగా ఈ సూచనను పాటించాల్సి ఉంటుంది. రాత్రి పూట త్వరగా భోజనం చేయడం వల్ల శరీరంలో కొవ్వు అధికంగా చేరకుండా చూసుకోవచ్చని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. దీని వల్ల ఊబకాయం బారిన పడకుండా ఉంటారు.

**క్యాన్సర్ రాకుండా..**

రాత్రి పూట త్వరగా భోజనం చేయడం వల్ల క్యాన్సర్ రాకుండా చూసుకోవచ్చని సైంటిస్టులు చెబుతున్నారు. రాత్రి పూట త్వరగా భోజనం చేస్తే క్యాన్సర్లు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని అంటున్నారు. త్వరగా భోజనం ముగించే పురుషులకు 26 శాతం వరకు క్యాన్సర్ ముప్పు తగ్గుతుంది. అదే స్త్రీలకు అయితే 16 శాతం వరకు క్యాన్సర్ వచ్చే ముప్పు తగ్గుతుంది. రాత్రి త్వరగా భోజనం చేసి త్వరగా నిద్రించడం వల్ల ఉదయం త్వరగా నిద్రలేస్తారు. దీని వల్ల నిద్రలేమి ఉండదు. పైగా ఉదయం నిద్ర లేచిన వెంటనే యాక్టివ్‌గా ఉన్నట్లు ఫీలవుతారు. శరీరానికి శక్తి లభించినట్లు ఉత్సాహం వస్తుంది. రోజంతా శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. యాక్టివ్‌గా పనిచేస్తారు. ఉత్సాహంగా ఉంటారు. బద్దకం పోతుంది.

**జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..**

రాత్రి పూట త్వరగా భోజనం చేస్తే జీర్ణ వ్యవస్థకు కావల్సినంత విశ్రాంతి లభిస్తుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయగలుగుతుంది. జీర్ణ వ్యవస్థలో ఉండే అవయవాలు సులభంగా మరమ్మత్తులకు గురవుతాయి. దీని వల్ల జీర్ణ సమస్యలు తగ్గిపోతాయి. ముఖ్యంగా గ్యాస్, అసిడిటీ, మలబద్దకం, అజీర్తి తగ్గుతాయి. అలాగే రాత్రి త్వరగా భోజనం చేస్తే నిద్రించే సమయానికి ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. రాత్రి పూట భోజనానికి, నిద్రకు మధ్య కనీసం 3 గంటల వ్యవధి ఉండాలని వైద్యులు చెబుతుంటారు. కనుక త్వరగా భోజనం చేయడం వల్ల నిద్రకు భంగం కలగదు. పైగా మరుసటి రోజు ఉదయం కూడా త్వరగా నిద్రలేస్తారు. ఇలా ఆరోగ్యకరమైన జీవనశైలి అలవడుతుంది. ఇక రాత్రి పూట త్వరగా భోజనం చేసేవారికి గుండె జబ్బులు వచ్చే అవకాశాలు సైతం చాలా తక్కువగా ఉంటాయని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల్లో తేలింది. కనుక రాత్రి పూట త్వరగా భోజనం చేస్తుంటే ఎన్నో లాభాలను పొందవచ్చు.

## ధర దడ!

### విడిభాగాలపై మరింత వ్యయం పెరిగిపోతున్న తయారీ ఖర్చు తడిసి మోపెడవుతున్న రవాణా ఎలక్ట్రానిక్స్, కార్ల ధరల పెంపు బాటలో కంపెనీలు

# ఆల్‌టైమ్ కనిష్టానికి రూపాయి



ఇళ్లలో వినియోగించే ముఖ్యమైన ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు ప్రియంగా మారుతున్నాయి. ఒకవైపు కొత్త ఇంధన సామర్థ్య ప్రమాణాలు అమల్లోకి రావడం, మరోవైపు ముడిసరుకుల ధరల పెరుగుదలతో కంపెనీలు ఒక విడత రేట్లను పెంచగా.. ఇప్పుడు ఇరాన్--ఇజ్రాయెల్, అమెరికా యుద్ధంతో వ్యయాల భారం పెరిగిపోయిందంటూ మరో విడత రేట్ల పెంపునకు తెరతీరాయి. దీంతో ఏసీలు, టీవీలు తదితర ఉత్పత్తుల ధరలు మరింత ప్రియం కానున్నాయి. గతేడాది సెపట?టంబర్‌లో జీఎస్టీలో శ్లాబుల కుదింపు ఫలితంగా వీటి ధరలు దిగిరాగా.. తాజాగా వీటి ధరలు పూర్వపు స్థాయిలను మించుతున్నాయి. మెమొరీ చిప్‌ల ధరల పెరుగుదలతో ఇప్పటికే స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్ల ధరలు ప్రియం కావడం తెలిసిందే. కమోడిటీ ధరల్లో అస్థిరతలు, రూపాయి క్షీణత, అధిక రవాణా, ఇంధన వ్యయాలను రేట్ల సవరణకు కారణాలని పంపిణీదారులు, డీలర్లకు కంపెనీలు తెలియజేస్తున్నాయి. ధరల పెంపు విషయమై తమ వాణిజ్య భాగస్వాములకు ఎల్‌జీ, శామ్‌సంగ్, పానాసోనిక్, డైకిన్, లాయిడ్స్ తాజాగా సమాచారమిచ్చాయి. ఏసీల ధరలు 10 శాతం వరకు, ఇతర ఉత్పత్తుల ధరలు 5 శాతం వరకు పెంచుతున్నట్టు ఎల్‌జీ ప్రకటించింది. ఏసీల ధరలను 8--12 శాతం మధ్య పెంచుతున్నట్టు పానాసోనిక్ తెలిపింది. డైకిన్, బ్లూస్టార్ సైతం 12 శాతం పెంపు దిశగా నిర్ణయాన్ని ప్రకటించింది. లాయిడ్స్ ఇప్పటికే ధరలను పెంచింది. శామ్‌సంగ్ సైతం ధరలను పెంచనున్నట్టు తెలిపింది. మెమొరీ చిప్‌లు ధరల పెరుగుదలతో టీవీల విక్రయ ధరలను పెంచక తప్పడం లేదని పేర్కొంది. వాస్తవానికి తయారీ వ్యయాల భారం పేరుతో ఏసీలు, టీవీల ధరలను 5--9% మధ్య కన్జ్యూమర్ గూడ్స్ కంపెనీలు జనవరిలో పెంచడం గమనార్హం. ఈ వరుస పెంపులతో డిమాండ్‌కు విఘాతం కలగొచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**వాహన ధరలు సైతం..**

తయారీ వ్యయాల పెరుగుదల నేపథ్యంలో ఆటోమొబైల్ సంస్థలు సైతం తమ వాహన విక్రయ ధరలను పెంచుతున్నాయి. టాటా మోటార్స్ తన ప్యాసింజర్, వాణిజ్య వాహనాల (ఇంటర్నల్ కంబస్టన్ ఇంజిన్) ధరలను 0.5--1.5% వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఏప్రిల్ నుంచి ఈ ధరల పెంపు అమల్లోకి రానుంది. లగ్జరీ కార్ల తయారీ సంస్థలైన మెర్సెడెజ్ బెంజ్, ఆడి, బీఎండబ్ల్యూ సైతం తమ వాహనాల ధరలను వచ్చే నెల నుంచి 2% వరకు పెంచుతున్నట్టు ప్రకటించాయి. హోండా సైతం ఈ దిశగా ఆలోచన చేస్తుండగా, మిగిలిన కంపెనీలూ ఇదే బాటలో నడిచే అవకాశాలు ఉన్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు.

**డిమాండ్‌పై ప్రభావం..**

తాజా ధరల పెంపుతో గతేడాది జీఎస్టీ సవరణల కారణంగా తగ్గిన ధరల ప్రయోజనం పూర్తిగా ఆవిరైపోతోందని, ఇది డిమాండ్‌ను బలహీనం చేయొచ్చని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇటీవలి వరుస ధరల పెంపు దురదృష్టకరమని, వినియోగ సెంటిమెంట్‌పై ప్రభావం చూపిస్తుందని ప్రముఖ ఎలక్ట్రానిక్ రిటైల్ చైన్ 'గ్రేట్ ఈస్టర్న్ రిటైల్' డైరెక్టర్ పులకిత్ బైద్ పేర్కొన్నారు. "జీఎస్టీ తగ్గింపు అనంతరం అధిక ముడి సరుకుల ధరల పేరుతో బ్రాండ్లు రేట్లను పెంచేశాయి. ప్రస్తుత అనిశ?చతుల్లో తరచుగా ధరల పెంపు డిమాండ్‌పై గణనీయమైన ప్రభావం చూపిస్తుంది"అని బైద్ అన్నారు. డిమాండ్ కోలుకోవడం మొదలైందంటూ, అయితే వరుస ధరల పెంపు డిమాండ్‌ను దెబ్బతీయొచ్చని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సైతం అభిప్రాయపడ్డారు.

# హక్కుల హరణం అన్యాయం



సమస్య ఉందని గుర్తించటం, దానికి పరిష్కారం అన్వేషించటం ఒక ఎత్తయితే అందుకు సంబంధించి చట్టం తీసుకురావటం మరో పెద్ద పని. మన దేశంలో చాలా సందర్భాల్లో అందుకు దశాబ్దాలు పడుతుంది. తీరా ఆ చట్టాన్ని కాస్తా నీరుగారిస్తే...? ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (హక్కుల పరిరక్షణ), చట్టం 2019కి కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన సవరణలు వారికి దక్కిన అరకొర హక్కుల్ని కాస్తా హరించేలా ఉన్నాయి. సృష్టి ఒక గీత గీసిందనీ, ఎవరైనా దానికి అటో, ఇటో ఉండాలి తప్ప వేరేవిధంగా ఉండటానికి వీల్లేదన్నది కాలం చెల్లిన భావన. మన దేశంలో తొలిసారి 2014లో ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల్ని గుర్తించి,వారికి కూడా ఇతరుల్లాగే ప్రాథమిక హక్కులుంటాయని సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఏ సమాజంలోనైనా అత్యధిక సంఖ్యాకుల అభిప్రాయాలే విలువలుగా చలామణిలోకొస్తాయి. ఆడ, మగ కలిసి ఉండటం సహజమనీ, ఇతరమైన సంబంధాలు అసహజమనీ భావించే ధోరణి అటువంటిదే. ప్రభుత్వాలు సైతం ఆ దోవనే పోవటంతో దశాబ్దాలుగా ఎల్‌జీబీటీక్యూ (లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్, క్వీర్) వర్గాల వారు అడుగడుగునా వివక్ష, అవమానాలు ఎదుర్కోవడం సాధారణ విషయాలుగా మారాయి. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన అయిదేళ్లకు 2019లో ఎట్టకేలకు ట్రాన్స్‌జెండర్ల హక్కుల పరిరక్షణ చట్టం వచ్చింది. ఆ చట్టం కింద జిల్లా కలెక్టర్‌కు ట్రాన్స్‌జెండర్‌నని దరఖాస్తు చేసుకున్నవారికి ధ్రువీకరణ పత్రం జారీ అయ్యేది. కొత్త సవరణ అలా కుదరదంటోంది. ప్రధాన వైద్యాధికారి లేదా ఉప వైద్యాధికారి ఆధ్వర్యంలో మెడికల్ బోర్డులు ఏర్పడాలనీ, వాటి సిఫార్సుల ఆధారంగానే కలెక్టర్లు ధ్రువీకరణ పత్రాలు జారీచేయాలనీ తాజా సవరణ చెబుతోంది. దీంతోపాటు ట్రాన్స్‌జెండర్ వ్యక్తులపై జరిగే హింస, భిక్షాటన చేయించటం నేరాలుగా పరిగణిస్తూ, కఠిన శిక్షలు నిర్దేశిస్తూ నిబంధనలు పొందుపరిచారు. అసలు జిల్లా కలెక్టర్ స్థాయిలో ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకోవటమే పెద్ద సమస్యగా పరిణమిస్తున్నదనీ, ఈ క్రమంలో వేధింపులు ఎదురవుతున్నాయినీ ఆ వర్గాలవారు ఆవేదన పడుతున్నారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోగా ధ్రువీకరణ ఇవ్వాలన్న నిబంధన ఉన్నా 2023 డిసెంబర్ నాటికి దరఖాస్తుల్లో 65 శాతం మాత్రమే పరిష్కారమయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి. ఈలోగా దాన్ని మరింత జటిలం చేసే సవరణలు వచ్చిపడ్డాయి. చట్టం రూపొందించేటపుడూ లేదా దానికి సవరణలు తీసుకురాదల్చుకున్నప్పుడూ సంబంధిత వర్గాలతో చర్చించటం, అవసరమైన మార్పులు చేర్పులకు సిద్ధపడటం ఒక ప్రజాస్వామిక సంప్రదాయం. సాగు చట్టాలు మొదలుకొని చాలా విషయాల్లో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దాన్ని పక్కనబెడుతోంది. పుట్టుకతో అందరూ గుర్తించిన జెండర్‌కు భిన్నమైన లైంగిక భావనలుండటం ప్రకృతి విరుద్ధం కాదని చెబుతూ స్వలింగసంపర్కాన్ని నేరంగా పరిగణించే సెక్షన్ 277 రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు 2018లో తీర్పునిచ్చింది. ఆ సందర్భంగా అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా 'స్వీయ వ్యక్తీకరణకు అవకాశం లేకపోవటం చావుతో సమానం' అని వ్యాఖ్యానించారు. ఆ వర్గాలవారు అసలే దారుణ వివక్ష ఎదుర్కొంటున్నారు. జాతీయ మానవ హక్కుల నివేదిక, 2018 ప్రకారం వారిలో 92 శాతం మంది ఆర్థిక వెలికి గురవుతున్నారు. అక్షరాస్యత కూడా 56.1 శాతం. జాతీయ సగటు 74 శాతంతో పోలిస్తే ఇది చాలా తక్కువ. నిరుద్యోగం 48 శాతం. బ్యాంకు ఖాతాలు తెరవాలన్నా అడ్డంకులు. ఇక ఆర్థిక సాయం పొందటం గురించి చెప్పేదేముంది? స్వలింగ సంపర్కం నేరం కాదని మొదటిసారి గుర్తించింది 1791 నాటి ఫ్రెంచ్ విప్లవం సమయంలో. లెనిన్ ఆధ్వర్యంలోని సోవియెట్ ప్రభుత్వం 1920లో స్వలింగసంపర్కుల హక్కుల్ని గుర్తించి చట్టం తీసుకొచ్చింది. ఆ మాత్రం మార్పు రావటానికి ప్రపంచ దేశాల్లో ఎంతకాలం పట్టిందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికీ దాన్ని మహాపాపంగా, నేరంగా పరిగణించే దేశాలు ఎన్నో! ఈ బిల్లుపై పార్లమెంటు చర్చించేలోగా ట్రాన్స్‌జెండర్ వర్గాలను సంప్రదించాలి. చట్టాన్ని మరింత సరళం చేయటం అవసరమని భావిస్తున్న తరుణంలో వారికి వ్యవస్థ ఆమోద ముద్రను తప్పనిసరి చేయటం ధర్మం కాదు.

# ప్రమాదకర పోకడలు



అమెరికా, ఇజ్రాయెల్--ఇరాన్‌ల మధ్య సాగుతున్న యుద్ధంలో రోజూ వందల సంఖ్యలో అమాయక పౌరులు మరణిస్తుంటే నిమ్మకు నీరెత్తినట్టున్న ప్రపంచ దేశాధినేతలు పశ్చిమాసియాలో గత రెండు రోజుల పరిణామాలతో మేల్కొన్నట్టు కనబడుతోంది. చమురు, సహజవాయు క్షేత్రాలపై పరస్పరం చేసుకుంటున్న దాడుల్లో అయిదు దేశాల్లోని ఆరు క్షేత్రాలు తీవ్రంగా దెబ్బతినటమే అందుకు కారణం. దక్షిణ ఇరాన్‌లోని సహజ వాయు క్షేత్రం పార్స్‌ను ఇజ్రాయెల్ గురిచూసి కొట్టిన వెంటనే ప్రపంచంలోనే అతి పెద్ద ఖతార్ సహజవాయు క్షేత్రం రస్ లఫాన్‌పైనా, దాంతోపాటు సౌదీ అరేబియా, కువైట్, ఇజ్రాయెల్ చమురుశుద్ధి కర్మాగారాలపైనా ఇరాన్ దాడులకు దిగింది. ఈ దాడుల వల్ల ఒక్క ఖతార్ సహజవాయు క్షేత్రం రస్ లఫాన్‌లోని 17 శాతం నిక్షేపాలు ఆవిరయ్యాయి. యుద్ధం పరిసమాప్తమయ్యేవరకూ దాన్ని చక్కదిద్దటం అసాధ్యం. ఆ పనులకు దాదాపు అయిదేళ్లు పడుతుందంటున్నారు. అంటే అయిదేళ్ల ఖతార్ ఆదాయం 10,000 కోట్ల డాలర్లు మాయమైనట్టు! దీనివల్ల మన దేశంతో సహా ఆసియా, యూరప్ దేశాలు తీవ్రసంక్షోభంలో చిక్కుకునే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికే బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ ధర 116 డాలర్లను దాటింది. అది 130కి చేరిందంటే అమెరికాతోపాటు అందరికీ కష్టాలు మొదలవుతాయి. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో కూడా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పరస్పర విరుద్ధ ప్రకటనలతో నవ్వులపాలవుతున్నారు. ఇరాన్ చమురు క్షేత్రాలపై ఇజ్రాయెల్ ఇక దాడి చేయబోదని ఆ దేశం తరపున ఆయన హామీ ఇచ్చారు. మరికొన్ని గంటలకే హార్మూజ్ దిగ్బంధాన్ని ఛేదించేందుకు ఇరాన్‌కు చెందిన ఖర్గ్ దీవిని స్వాధీనం చేసుకునే పథక రచన సాగిస్తున్నట్టు లీకులిచ్చారు. అసలు ఇజ్రాయెల్ తన ఆదేశం పాటిస్తుందని నిజంగా ట్రంప్ భావిస్తున్నారా? అది ఎప్పుడో ఆ స్థితిని దాటిపోయింది. ప్రస్తుతం ఇజ్రాయెల్ శక్తిమంతమైన సేవకుడిగా మారితే, అమెరికా బలహీనమైన యజమానిగా మిగిలిపోయింది. పశ్చిమాసియాలో 'గ్రేటర్ ఇజ్రాయెల్' ఆవిర్భవించటానికి వీలుగా చుట్టూవున్న ముస్లిం దేశాల్ని పాదాక్రాంతం చేసుకోవాలని 1996లోనే ఇజ్రాయెల్ పథక రచన చేసింది. గత అమెరికా అధినేతల దగ్గర దాని ఎత్తులు పారలేదు. తెలిసీ తెలియని ట్రంప్ ఆ కొరతను తీర్చారు. తమకు క్షిపణులకు కొరతేమీ లేదని ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రతినిధి అలీ మహమ్మద్ నైనిపై ఇజ్రాయెల్ దాడిచేసి హతమార్చింది. ఇలాంటి చర్యలు యుద్ధ విరమణను జటిలం చేస్తాయి తప్ప సాధించేదేమీ ఉండదు. యుద్ధం నాలుగో వారంలోకి ప్రవేశించిన దశలో కూడా ఆ రెండు దేశాలూ అతిగా అంచనా వేసుకుంటూ, ఇరాన్‌పై తప్పుడు లెక్కలు కడుతున్నాయి. చట్టవిరుద్ధ మైన ఈ యుద్ధానికి మరో 20,000 కోట్ల డాలర్లు కావాలంటూ అమెరికన్ కాంగ్రెస్‌ను పెంటగాన్ అభ్యర్థించింది. ఇప్పటికే అమెరికన్ కుబేరులకు కోట్లాది డాలర్ల పన్ను రాయితీలిచ్చిన ప్రభుత్వం, సాధారణ ప్రజానీకానికి అందే అరకొర సదుపాయాలకు సైతం కోత పెడితే తప్ప ఈ నిధులు సమకూర్చుకోలేదు. ఈ అకారణ యుద్ధానికి ఇన్ని వేల కోట్లు దుర్వినియోగం చేయటం అవసరమా? వీటి సంగతలా ఉంచి అత్యంత అమానవీయ పద్ధతుల్లో కృత్రిమ మేధ(ఏఐ) సాయంతో ప్రాణాలు తీస్తున్న అమెరికా, ఇజ్రాయెల్ దుశ్చర్యల పర్యవసానాలేమిటో కనబడుతూనే ఉన్నాయి. ఓపెన్ ఏఐ, పాలంటీర్ కలిసి ఆంత్రోపిక్ రూపొందించిన క్లాడ్ ఆసరాతో మారణహోమానికి తోడ్పడుతున్నాయి. పదేళ్లుగా పాఠశాల నడుస్తున్న ఒక ఆవరణను ఏఐ ఇరాన్ సైనిక స్థావరంగా అర్థం చేసుకుని చూపితే, దాని ఆధారంగా అమెరికా క్షిపణి దాడికి పాల్పడి ఒకేసారి 170 మంది బాలబాలికల ప్రాణాలు తీసింది. సైనిక దాడులకోసం తమ సాఫ్ట్‌వేర్ ఇచ్చేది లేదని ట్రంప్‌కు చెప్పిన ఆంత్రోపిక్ అయినా, ఆ కాంట్రాక్టును చేజిక్కించుకుని లాభపడిన ఓపెన్ ఏఐ అయినా సారాంశంలో ఈ ప్రాణాంతక దాడులకు వ్యతిరేకం కాదు. ఆంత్రోపిక్ అభ్యంతరమల్లా ఆ సాఫ్ట్‌వేర్‌మరింత పదునుదేరాలన్నదే. ఆ తర్వాతే అందుబాటులోకి తీసుకురావాలని దానిఉద్దేశం. ప్రపంచ మనుగడ ఎంత ప్రమాదకరంగా మారిందో దీన్నిబట్టే గ్రహించవచ్చు.

# ఆరోగ్యకరమైన కణాలకు నష్టం తగ్గేలా.. భారత శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ

భారత శాస్త్రవేత్తలు ఆర్‌కే-251 క్యాన్సర్ ఔషధం

క్యాన్సర్ కణాల్లోనే క్రియాశీలమయ్యేలా రూపకల్పన

ఆరోగ్యకరమైన కణాలపై ప్రభావం తగ్గించే లక్ష్యం

ట్రిపుల్-నెగెటివ్ రొమ్ము క్యాన్సర్‌పై మంచి ఫలితాలు

జీబ్రాఫిష్ పరీక్షల్లో లేని స్పష్టమైన విషపూరిత ప్రభావాలు




క్యాన్సర్ చికిత్సలో మరింత కచ్చితత్వం సాధించే దిశగా భారత శాస్త్రవేత్తలు కీలక ముందడుగు వేశారు. కణితి కణాల్లోనే క్రియాశీలవంయ్యేలా రూపొందించిన 'స్మార్ట్' క్యాన్సర్ ఔషధాన్ని అభివృద్ధి చేశారు. ఆరోగ్యకరమైన కణాలపై ప్రభావాన్ని తగ్గించేలా ఈ మందును రూపొందించారు. ఈ పరిశోధనకు 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ' (ఐఏఎస్ఎస్‌టీ) శాస్త్రవేత్త డాక్టర్ అసిస్ బాలా నేతృత్వం వహించారు. ఐఐటీ గువాహటి శాస్త్రవేత్త డాక్టర్ కె.పీ. భబక్ సహకరించారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో ఐఏఎస్ఎస్‌టీ పనిచేస్తోంది. ఆర్‌కే-251గా పిలుస్తున్న ఈ ఔషధం సాధారణ కణజాలంలో పెద్దగా క్రియాశీలంగా ఉండదు. క్యాన్సర్ కణాల్లోకి వెళ్లిన తర్వాత మాత్రం పనిచేయడం మొదలుపెడుతుంది. సాధారణ క్యాన్సర్ చికిత్సల్లో కణితి కణాలతో పాటు ఆరోగ్యకరమైన కణాలు కూడా దెబ్బతినే అవకాశం ఉంటుంది. దీంతో పలు దుష్ప్రభావాలు ఎదురవుతాయి. క్యాన్సర్ కణాల్లో సాధారణ కణాల కంటే రియాక్టివ్ ఆక్సిజన్ స్పీషీస్ (ఆర్ఓఎస్) స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. ఇదే వ్యత్యాసాన్ని ఆర్‌కే-251లో శాస్త్రవేత్తలు ఉపయోగించారు. క్యాన్సర్ కణంలోకి మందు చేరినప్పుడు అధిక ఆర్ఓఎస్ స్థాయిలు ఔషధాన్ని క్రియాశీలం చేస్తాయి. ఆర్‌కే-251 క్రియాశీలమైన తర్వాత ఎన్‌బీడీహెక్సీ అనే శక్తిమంతమైన క్యాన్సర్ నిరోధక పదార్థాన్ని విడుదల చేస్తుంది. ఇది కొన్ని క్యాన్సర్ కణాల మనుగడకు, చికిత్సను తట్టుకునే సామర్థ్యానికి కీలకమైన ప్రొటీన్లను లక్ష్యంగా చేసుకుంటుంది. దీంతో ఆరోగ్యకరమైన కణాలకు నష్టం తగ్గిస్తూ క్యాన్సర్ కణాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రయోగశాల పరీక్షల్లో ట్రిపుల్-నెగెటివ్ రొమ్ము క్యాన్సర్ కణాలపై ఆర్‌కే-251 మంచి ప్రభావం చూపింది. ఆరోగ్యకరమైన కణాలపై మాత్రం ప్రభావం చాలా తక్కువగా కనిపించింది. జీబ్రాఫిష్ పిండాలపై నిర్వహించిన పరీక్షల్లోనూ స్పష్టమైన విషపూరిత ప్రభావాలు కనిపించలేదు. అయితే ఆర్‌కే-251 ఇంకా ప్రయోగశాల దశలోనే ఉంది. ఇది ప్రస్తుతం రోగులకు అందుబాటులో లేదు. మనుషులపై ఉపయోగించే ముందు మరిన్ని భద్రతా పరీక్షలు, ప్రయోగశాల అధ్యయనాలు, క్లినికల్ ట్రయల్స్ అవసరం.

# చిన్నారుల మందులపై కేంద్రం కీలక ఆదేశాలు.. నాలుగేళ్లలోపు పిల్లలకు ఆ మెడిసిన్ వాడొద్దు!

నాలుగేళ్ల లోపు చిన్నారులకు కొన్ని మందులపై కేంద్రం ఆంక్షలు

క్లోర్‌ఫెనిరమైన్, ఫినైల్‌ఫ్రైన్ ఉన్న ఎఫ్‌డీసీ మందులకు ఇది వర్తింపు

మందుల లేబుల్‌పై హెచ్చరిక తప్పనిసరిగా ముద్రించాలని ఆదేశం

నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం

ఈ మందుల తయారీ, అమ్మకాలు, పంపిణీపై పరిమితులు





చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగేళ్ల లోపు చిన్నారులకు క్లోర్‌ఫెనిరమైన్ మలేట్, ఫినైల్‌ఫ్రైన్ హైడ్రోక్లోరైడ్‌తో కూడిన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ) ఔషధాల వాడకంపై కేంద్రం ఆంక్షలు విధించింది. ఈ ఔషధాల తయారీ, విక్రయాలు, పంపిణీని పరిమితం చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. సాధారణంగా జలుబు, దగ్గు, అలర్జీ వంటి సమస్యల నివారణకు వాడే ఔషధాలలో ఈ కాంబినేషన్‌ను వినియోగిస్తారు. ఇకపై ఈ మందుల లేబుల్స్, ప్యాకేజీలపై "ఈ ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్‌ను నాలుగేళ్ల లోపు పిల్లలకు ఇవ్వరాదు" అనే హెచ్చరికను తప్పనిసరిగా ముద్రించాలని ఔషధ తయారీ సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది. నిపుణుల కమిటీ, డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డీటీఏబీ) చేసిన సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. గతంలో 2025 ఏప్రిల్ 15న ఈ సమ్మేళనాలు కలిగిన కొన్ని ఎఫ్‌డీసీ మందులపై మాత్రమే ప్రభుత్వం ఇలాంటి ఆంక్షలు విధించగా, తాజా ఉత్తర్వుల ద్వారా ఈ నిబంధనను అన్ని రకాల ఫార్ములేషన్లకు వర్తింపజేసింది. నాలుగేళ్ల లోపు చిన్నారులపై ఈ మందులు ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని, వీటికి బదులుగా సురక్షితమైన ప్రత్యామ్నాయ ఔషధాలు అందుబాటులో ఉన్నాయని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్-1940లోని సెక్షన్ 26ఏ కింద కేంద్ర ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.



# ప్లాస్టిక్ స్టూల్ మధ్యలో రంధ్రం ఎందుకు ఉంటుంది?



స్టూల్స్ అతుక్కోకుండా గాలి బయటకు వెళ్లేందుకు రంధ్రం

నీరు నిల్వ కాకుండా ఉపయోగం

తయారీలో ప్లాస్టిక్ సమానంగా చల్లబడేందుకు సహాయం

ప్లాస్టిక్ వినియోగం, తయారీ ఖర్చు తగ్గింపు

స్టూల్ డిజైన్, బరువు పంపిణీలోనూ పాత్ర

దుకాణాల్లో, హోటళ్లలో, ఫంక్షన్లలో ప్లాస్టిక్ స్టూల్స్ కనిపించడం సర్వ సాధారణం. అయితే వాటి మధ్యలో ఉండే చిన్న రంధ్రం ఎందుకు ఉంటుందో ఎప్పుడైనా ఆలోచించారా? అది కేవలం స్టూల్‌ను పట్టుకుని తీసుకెళ్లడానికి లేదా డిజైన్ కోసమే కాదట. దాని వెనుక పలు ప్రయోజనాలు ఉన్నాయి.

**ఒకదానిపై ఒకటి పెట్టినప్పుడు**

ప్లాస్టిక్ స్టూల్స్‌ను స్థలం ఆదా చేసేందుకు ఒకదానిపై ఒకటి పేర్చుతుంటారు. ఇలా చేసినప్పుడు వాటి మధ్య గాలి చిక్కుకొని సక్షన్ లేదా వాక్యూమ్ ప్రభావం ఏర్పడే అవకాశం ఉంటుంది. దీంతో స్టూల్స్‌ను విడదీయడం కష్టమవుతుంది. మధ్యలోని రంధ్రం ద్వారా గాలి బయటకు వెళ్లి, ఈ సమస్య తగ్గుతుంది.

**తయారీ ప్రక్రియలోనూ ఉపయోగమే..**

ప్లాస్టిక్ స్టూల్స్‌ను సాధారణంగా ఇంజెక్షన్ మోల్డింగ్ పద్ధతిలో తయారు చేస్తారు. పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ ఒకేచోట ఉండటం వల్ల చల్లబడే సమయంలో అసమానతలు ఏర్పడి, వంకరలు లేదా ఇతర లోపాలు రావచ్చు. అందుకే రంధ్రాలు, మందంతో ఉన్న భాగాలు, బలాన్ని పెంచే రిబ్స్‌ను డిజైన్‌లో ఉపయోగిస్తారు.

**నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ..**

బయట, బాత్రూమ్‌లో లేదా శుభ్రం చేసే సమయంలో స్టూల్‌పై నీరు నిలిచిపోవచ్చు. మధ్యలోని రంధ్రం ద్వారా నీరు బయటకు వెళ్లిపోతుంది. దీంతో స్టూల్‌ను కడగడం, ఆరబెట్టడం కూడా సులభమవుతుంది.

**ఖర్చు తగ్గింపు**

ప్లాస్టిక్ స్టూల్స్‌ను భారీ సంఖ్యలో తయారు చేస్తారు. ఒక్కో స్టూల్‌లో కొద్దిపాటి ప్లాస్టిక్‌ను తగ్గించినా, పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసే సమయంలో గణనీయమైన ముడిసరుకు, తయారీ ఖర్చు ఆదా అవుతుంది. అవసరం లేని చోట ప్లాస్టిక్‌ను తొలగిస్తూ, మిగతా డిజైన్ ద్వారా తగిన బలాన్ని అందించేలా తయారు చేస్తారు.

**బలానికి కూడా డిజైన్ పాత్ర**

మధ్యలో రంధ్రం ఉండటం వల్ల ప్రతి స్టూల్ ఆటోమేటిక్‌గా మరింత బలంగా మారుతుందని చెప్పలేం. స్టూల్ ఆకారం, ప్లాస్టిక్ మందం, సపోర్టింగ్ రిబ్స్ వంటి అంశాలు బరువును ఎలా పంపిణీ చేస్తాయన్నదే ముఖ్యమైన విషయం. అంటే రంధ్రం పరిమాణం, స్టూల్ మొత్తం డిజైన్‌ను బట్టి దాని నిర్మాణపరమైన ప్రయోజనం ఉంటుంది.

# తిన్నది వంటపట్టడం లేదా?

రోజూ ఇలా చేయండి!

ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థ కోసం నిపుణులు సూచిస్తున్న సాధారణ అలవాట్లు

ఆహారాన్ని నెమ్మదిగా, బాగా నమిలి తినాలి

భోజనానికి, నిద్రకు మధ్య కనీసం రెండు గంటల విరామం అవసరం

తిన్న వెంటనే కాసేపు నెమ్మదిగా నడవడం జీర్ణక్రియకు మేలు

తగినంత నీరు తాగడం, మితంగా తినడం చాలా ముఖ్యం

ఇళ్లలో, వ ం న ం తీసుకునే ఆహారం శరీరానికి శక్తినివ్వాలి. కానీ, ఆధునిక జీవనశైలిలో చాలామందికి తిన్నది సరిగ్గా జీర్ణం కాక గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు సర్వసాధారణం అయ్యాయి. మనం తినే పద్ధతిలో కొన్ని చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా ఈ ఇబ్బందులను సులభంగా అధిగమించవచ్చు. తిన్న ఆహారం సక్రమంగా వంటపట్టి, శరీరం ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడే ముఖ్యమైన అలవాట్ల గురించి తెలుసుకుందాం.



1. నెమ్మదిగా నమిలి తినడం

జీర్ణప్రక్రియ కడుపులో కాదు, నోట్లోనే మొదలవుతుంది. ఆహారాన్ని ఎంత బాగా నమిలితే, లాలాజలంలోని ఎంజైమ్‌లతో అంత బాగా కలిసి చిన్న ముక్కలుగా మారుతుంది. దీనివల్ల కడుపుపై భారం తగ్గి, జీర్ణక్రియ సులభమవుతుంది. చాలామంది హడావుడిగా, సరిగ్గా నమలకుండా మింగేస్తుంటారు. దీనివల్ల పెద్ద ఆహార ముక్కలను అరిగించడానికి జీర్ణాశయం తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది. ఫలితంగా అజీర్తి, గ్యాస్ వంటి సమస్యలు తలెత్తుతాయి. అందుకే ప్రతి ముద్దను కనీసం 20 నుంచి 30 సార్లు నమిలి తినడం అలవాటు చేసుకోవాలి. ఇది త్వరగా కడుపు నిండిన భావన కలిగించి, అతిగా తినడాన్ని కూడా నియంత్రిస్తుంది.



2. సమయపాలన పాటించడం

మన శరీరానికి ఒక జీవ గడియారం (బయోలాజికల్ క్లాక్) ఉంటుంది. రోజూ ఒకే సమయానికి భోజనం చేయడం వల్ల, ఆ సమయానికి జీర్ణరసాలు సక్రమంగా విడుదలై జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. సమయం కాని సమయాల్లో తినడం, భోజనం మానేయడం జీర్ణవ్యవస్థను గందరగోళానికి గురిచేస్తుంది. ముఖ్యంగా, తిన్న వెంటనే నిద్రపోవడం లేదా వ్యాయామం చేయడం వంటివి అస్సలు మంచిది కాదు. భోజనం తర్వాత కనీసం 10-15 నిమిషాల పాటు నెమ్మదిగా నడవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రాత్రిపూట వీలైనంత త్వరగా భోజనం చేయడం అత్యంత ముఖ్యమైన అలవాటు. దీనివల్ల జీర్ణవ్యవస్థకు రాత్రంతా దాదాపు 10 నుంచి 12 గంటల పాటు పూర్తి విశ్రాంతి లభిస్తుంది.

3. సరైన మోతాదులో ఆహారం, నీరు

శరీరానికి నీరు చాలా అవసరం. కానీ భోజనం చేసేటప్పుడు ఎక్కువగా నీరు తాగితే, జీర్ణరసాలు పలుచబడి జీర్ణక్రియ మందగిస్తుంది. అందుకే భోజనానికి అరగంట ముందు, తిన్న అరగంట తర్వాత నీళ్లు తాగడం ఉత్తమమైన పద్ధతి. అలాగే, కడుపు బిగిసేలా తినకుండా, కాస్త ఖాళీ ఉంచుకొని మితంగా తినాలి. ఒకేసారి ఎక్కువ ఆహారం తీసుకోవడం జీర్ణాశయంపై తీవ్ర ఒత్తిడిని పెంచి, అజీర్ణానికి దారితీస్తుంది.

ఈ మూడు సాధారణ అలవాట్లను మన దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే, ఎలాంటి మందులు లేకుండానే జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేసుకోవచ్చు. తద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చు.

APTEL/26/A4813
శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక
కొత్త ఆలోచన.. కొత్త వార్త



## కడప బేసిన్‌లో రూ.13 లక్షల కోట్ల విలువైన క్రిటికల్ మినరల్స్ నిక్షేపాలు ..మంత్రి కొల్లు రవీంద్ర

### సీ ఎస్ ఐ ఆర్, ఎన్ జి ఆర్ ఐతో ఏపీ ప్రభుత్వం చారిత్రాత్మక ఒప్పందం





ఆంధ్రప్రదేశ్ శ్రీ వార్త న్యూస్ : కడప బేసిన్ వెంపల్లె, తుమ్మలపల్లె ప్రాంతంలో లిథియం, గాలియం వంటి క్రిటికల్ మినరల్స్ భారీగా ఉన్నట్లు గుర్తించామని, సుమారు రూ.13 లక్షల కోట్ల విలువైన నిక్షేపాలు ఉన్నాయని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. హైదరాబాద్ సీ ఎస్ ఐ ఆర్, ఎన్ జి ఆర్ ఐలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మంత్రి, అన్వేషణ కోసం ఏపీ గనుల శాఖ సీ ఎస్ ఐ ఆర్, ఎన్ జి ర్ ఐతో ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారు. భూగర్భంలో 1000 పీ పీ యం వరకు లిథియం, 250పీ పీ యం వరకు గాలియం ఉన్నట్లు గుర్తించామని, ప్రాథమికంగా రూ.2 లక్షల కోట్ల విలువైన లోహాలు ఉన్నాయని అంచనా వేశారు. 2027లో ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్టు 2032 నాటికి పూర్తవుతుందని, ఖర్చును కేంద్ర ఎన్ యంఇటీ భరిస్తుందని, రాష్ట్ర బడ్జెట్‌పై భారం పడదన్నారు. వైమానిక సర్వేలు, ఏఐ శాటిలైట్ టెక్నాలజీతో అన్వేషణ చేస్తామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఏపీలోనే మినరల్ ప్రాసెసింగ్, బ్యాటరీ తయారీ పరిశ్రమలు వచ్చి స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో సీ ఎస్ ఐ ఆర్ డైరెక్టర్ డా. ప్రకాశ్ కుమార్, శాస్త్రవేత్త డా. బి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభ ఉద్యోగి" అవార్డు అందుకున్న పల్లవికి ఘన సత్కారం



పామర్రు శ్రీ వార్త న్యూస్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్తూ, విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలందిస్తున్న స్థానికగ్రామసచివాలయం2 సంక్షేమ మరియు విద్యా శాఖ సహాయకురాలు కంఠ మనేని పల్లవి కి ( డబ్ల్యూ ఈ ఏ) సోమవారం ఘన సత్కారం జరిగింది. దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ నవీన్ చేతుల మీదుగా ఆమె ప్రతిష్టాత్మక "ఉత్తమ సచివాలయం ఉద్యోగి" అవార్డును అందుకున్నారు. ఆమె అవార్డు గుర్తిస్తూ సచివాలయా విధి నిర్వహణలో ఉన్న ఆమెకు ఏపీ క్రైస్తవ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది తో కలిసి ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, విధి నిర్వహణలో అనే క ఒత్తిడులను అధిగమిస్తూ ప్రజా సేవే లక్ష్యంగా పని చేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ఆమె నిరంతరం శ్రమిస్తున్నారన్నారు . అధికారుల సమన్వయంతో ఆమె అందిస్తున్న సేవలు అందరికీ ఆదర్శం" అని కొనియాడారు. అవార్డు గ్రహీత పల్లవి మాట్లాడుతూ: "ఈ ఉత్తమ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. ఈ గుర్తింపు నాపై బాధ్యతను మరింత పెంచింది. ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించడానికి, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పని చేయడానికి ఇది ఎంతో స్ఫూర్తిని ఇస్తుంది. నాకు సహకరించిన ఉన్నతాధికారులకు, తోటి సిబ్బందికి ధన్యవాదాలు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లా బత్తుల, ఉపాధ్యక్షులు టి సాలెం రాజు, కార్యదర్శి కే ప్రసాద్ నాతోపాటు సచివాలయ అడ్మిన్ నరేష్ బాబు,, డిజిటల్ అసిస్టెంట్, హుస్సేన్ సాహెబ్ మహిళా పోలీస్ రాజేశ్వరి స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కూనపరెడ్డి సత్య ప్రసాద్ కన్నుమూత



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ : మచిలీపట్నం ప్రముఖ న్యాయవాది, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కూనపరెడ్డి లక్ష్మీ వీర శివ సత్య ప్రసాద్ (73) సోమవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయన, మచిలీపట్నంలోని నాయర్ బండి సెంటర్‌లోని తన స్వగృహంలో కన్నుమూశారు. న్యాయవాద వృత్తిలో సుదీర్ఘకాలం సేవలందించిన సత్య ప్రసాద్ పలు ముఖ్యమైన కేసుల్లో వాదనలు వినిపించి న్యాయవాదిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. అనంతరం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కూడా సామాన్యుల పక్షాన నిలిచి సుదీర్ఘకాలం న్యాయసేవలందించారు. ఆయన మృతి పట్ల న్యాయవాదులు, న్యాయశాఖకు చెందిన ప్రముఖులు, బంధువులు, మిత్రులు, పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతిమయాత్ర మంగళవారం ఉదయం 10 గంటలకు మచిలీపట్నం నాయర్ బండి సెంటర్‌లోని ఆయన స్వగృహం నుంచి ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## తాతయ్య, నాన్నమ్మ కథలు చెబితే పిల్లలకు ఇన్ని ప్రయోజనాలా? సైన్స్ చెబుతున్న 3 విషయాలు

తాతయ్య, నాన్నమ్మల దగ్గర కూర్చొని వాళ్ల చిన్ననాటి కథలు వినడం పిల్లలకు ఓ మధురమైన జ్ఞాపకం. కుటుంబంలో జరిగిన సంఘటనలు, తల్లిదండ్రుల చిన్ననాటి అనుభవాలు, కష్టాలను ఎలా ఎదుర్కొన్నారనే విషయాలు పిల్లల ఆలోచనా విధానంపై కూడా ప్రభావం చూపుతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథలు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడం, భాషా నైపుణ్యాలను మెరుగుపరచడం, ఇతరులతో అనుబంధాన్ని బలోపేతం చేయడంలో ఉపయోగపడతాయి.

1. 'నేను ఎవరు?' అనే భావన బలపడుతుంది

పిల్లలు తమ గురించి తెలుసుకునే క్రమంలో కుటుంబ కథలకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. కుటుంబంలో జరిగిన విషయాలను పిల్లలకు పెద్దలు చెప్పినప్పుడు తమ కుటుంబ నేపథ్యం, తమ తల్లిదండ్రుల అనుభవాలు, ఎదుర్కొన్న కష్టాల గురించి పిల్లలకు తెలుస్తుంది. ఉదాహరణకు.. 'మీ అమ్మ కూడా చిన్నప్పుడు స్కూల్‌కి వెళ్లడానికి భయపడేది' అని అమ్మమ్మ చెబితే.. తనకే ఎదురవుతున్న సమస్య కాదని పిల్లలకు అర్థమవుతుంది. ఇలాంటి కథలు కష్టాలను ఎదుర్కొనే ధైర్యాన్ని, నేను అనే ఆత్మవిశ్వాసాన్ని పెంచే అవకాశం ఉంటుంది.

2. భాషా నైపుణ్యాలు.. కథలు వినేటప్పుడు పిల్లలు కొత్త పదాలు, వాక్య నిర్మాణాలు, వివరణలు, సంభాషణలు వింటారు. ఒక సంఘటన మొదలై.. దాని తర్వాత ఏం జరిగిందో అర్థం చేసుకోవడానికి వారు శ్రద్ధగా వినాలి. ముఖ్యంగా చిన్న పిల్లల్లో కథలను అర్థం చేసుకునే సామర్థ్యానికి పదజాలం, వ్యాకరణ పరిజ్ఞానం కీలకమని పరిశోధనలు సూచిస్తున్నాయి. తాతయ్య, నాన్నమ్మలు చెప్పే భిన్నమైన కథలు పిల్లలకు కొత్త పదాలు, కొత్త అనుభవాలను పరిచయం చేయగలవు.

3. భావోద్వేగాలను అర్థం చేసుకోవడం

తాతయ్య లేదా నాన్నమ్మ ఒకప్పుడు తాము ఎదుర్కొన్న భయం, నిరాశ, సంతోషం లేదా వైఫల్యం గురించి చెప్పినప్పుడు పిల్లలు కేవలం కథ వినడం మాత్రమే చేయరు. 'అప్పుడు మీకు ఎలా అనిపించింది?', 'తర్వాత ఏం చేశారు?' అంటూ ప్రశ్నలు అడుగుతారు. దీంతో ఇతరుల భావాలను అర్థం చేసుకోవడం, తమ అనుభవాలతో పోల్చుకోవడం వంటి సామాజిక, భావోద్వేగ నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. తాతయ్య, నాన్నమ్మలతో ఏర్పడే ఆప్యాయమైన అనుబంధం కూడా పిల్లల సామాజిక నైపుణ్యాలకు మేలు చేస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి.

అసలు కథలో ఉన్న మ్యాజిక్ ఇదే.. తాతయ్య, నాన్నమ్మ కథలు పిల్లలకు పెద్ద జీవిత పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదు. వాళ్లు చిన్నప్పుడు చేసిన అల్లరి, ఎదుర్కొన్న కష్టం, మొదటి ఉద్యోగం, స్కూల్ అనుభవం.. ఇలా ఏ చిన్న జ్ఞాపకమైనా పిల్లలకు విలువైనదే. అందుకే వాళ్లు కథ చెబుతున్నప్పుడు ఫోన్ పక్కన పెట్టి పిల్లలను కాసేపు విననివ్వండి. ఏళ్ల తర్వాత పిల్లల మనసులో నిలిచిపోయేది పెద్దలు చెప్పిన ఉపదేశం కాకపోవచ్చు.. తమ పక్కనే కూర్చొని తాతయ్య, నాన్నమ్మ చెప్పిన ఆ చిన్న కథే కావచ్చు.

## ఉయ్యూరులో డయేరియా లక్షణాలపై కలెక్టర్ డీకే బాలాజీ ప్రత్యేక దృష్టి

### 5, 18, 19వ వార్డుల్లో తాగునీటి కాలుష్యంపై సమగ్ర తనిఖీలు ప్రతి ఇంటినీ పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశం





ఉయ్యూరు శ్రీ వార్త న్యూస్ : కృష్ణా జిల్లా కలెక్టర్ శ్రీ డీకే బాలాజీ ఉయ్యూరులో డయేరియా లక్షణాల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉయ్యూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి, డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతున్న రోగులను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారుల వివరాల ప్రకారం ఇప్పటివరకు 26 మంది డయేరియా లక్షణాలతోటి సిహెచ్సిలో అడ్మిట్ అయ్యారని వారిలో 18 మంది డిశ్చార్జ్ అయ్యారని మిగతా ఎనిమిది మందికి వైద్య సేవలు అందుతున్నాయని వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలియజేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, డయేరియా లక్షణాలు కనిపించడానికి గల కారణాలు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. రోగులు, వారి బంధువుల నుంచి వివరాలను స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం సమస్యకు మూల కారణాన్ని గుర్తించేందుకు తక్షణ చర్యలు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీ సోమశేఖర్, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీ ప్రవీణ్‌లను వెంటనే, సంబంధిత అధికారులతో కలిసి సంయుక్తంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రత్యేకంగా ఉయ్యూరు పట్టణంలోని 5, 18, 19వ వార్డుల్లో ప్రతి ఇంటినీ సందర్శించి తాగునీటి సరఫరా వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎక్కడైనా నీటి కాలుష్యం లేదా కలుషిత నీరు సరఫరా అవుతున్నట్లు గుర్తిస్తే వెంటనే కారణాలను నిర్ధారించి, తీసుకోవాల్సిన సరిదిద్దే చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీటి పైపులైన్లు, లీకేజీలు, డ్రైనేజీ వ్యవస్థ, నీటి సరఫరా మార్గాలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి, ప్రజల ఆరోగ్యానికి ఎటువంటి ముప్పు లేకుండా తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. డయేరియా లక్షణాలకు గల ఖచ్చితమైన కారణాలను గుర్తించేందుకు అన్ని కోణాల్లో విచారణ జరిపి, అవసరమైన సాంకేతిక పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి కాలుష్యానికి గల కారణాలను గుర్తించి, సమస్య పునరావృతం కాకుండా చేపట్టాల్సిన శాశ్వత సరిదిద్దే చర్యలపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, డయేరియా లక్షణాల నియంత్రణకు వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ముక్తి రామేశ్వరం క్షేత్రం .. హనుమత్ రామలింగేశ్వర క్షేత్రం

### ప్రొద్దుటూరుకు ఆ పేరు ఎలా వచ్చింది?

**ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు**





ప్రొద్దుటూరు, ఆగస్టు 24 : (శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధి ): ముక్తి రామేశ్వరం క్షేత్రం 16 వ శతాబ్దంలో శ్రీకృష్ణ దేవరాయలు నిర్మించినట్లు గోడలపై లిఖించబడిన శాసనాల ప్రకారం తెలుస్తోంది. రాజగోపురం అందమైన శిల్పాలతో కూడిన ఐదు అంతస్తుల నిర్మాణం. అయోధ్యకు వెళ్ళే మార్గంలో, సూర్యాస్తమం అవుతుండటంతో రాముడు తన ప్రయాణాన్ని పెన్నానది సమీపంలో ఆపాలని నిర్ణయించుకున్నాడు. రావణుడిని చంపిన పాపానికి బ్రహ్మహత్యా పాతకం శ్రీరాముని మెడకు చుట్టుకుంది. శ్రీరాముడు ఎక్కడకు వెళ్లినా తనకన్నా ముందు ఒక పిల్లి శ్రీరాముని వెంబడిస్తోంది. దీన్ని బట్టి తనకు బ్రహ్మహత్యా పాతకం



చుట్టుకుందని శ్రీరాముడు గుర్తించాడు. బ్రహ్మహత్యా పాతకం పోగొట్టుకోవడానికి శ్రీరాముడు తెల్లవారు జామున శివుడిని పూజించాలని అనుకున్నాడు. శ్రీరాముడు హనుమంతుడిని కాశీ నుండి శివ లింగాన్ని తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు. శివలింగాన్ని తీసుకొనిరావడానికి కాశీకి వెళ్లిన ఆంజనేయుడు పూజా సమయానికి తిరిగి రాలేకపోయాడు. సమయం మించిపోతుందని సమయానికి పూజ పూర్తి చేయడం కోసం, శ్రీరాముడు తాను ఇసుకతో చేసిన శివలింగాన్ని ప్రతిష్టించి అభిషేకం చేశాడు. ఈ లింగాన్ని సైకత లింగం అని పిలుస్తారు. ఆంజనేయుడు శివలింగాన్ని తీసుకొనివచ్చాడు. అయితే సమయం మించిపోతుందని శ్రీరాముడు తాను తెచ్చిన శివలింగానికి బదులుగా సైకత లింగం ప్రతిష్టించినట్లు తెలుసుకున్న ఆంజనేయుడు ఎంతో బాధపడ్డాడు. శ్రీరామునిపై హనుమ ఆగ్రహం ప్రదర్శించాడు. ఆంజనేయుడిని శాంత పరచడానికి ఆయన్ను సంతోష పెట్టడానికి శ్రీరాముడు హనుమంతుడు తెచ్చిన శివలింగాన్ని కూడా సైకత లింగానికి కొంచెం దూరంలో తానే ప్రతిష్టించాడు. అంతేకాకుండా తాను ముందుగా ప్రతిష్టించిన సైకత లింగానికి ముందుగా హనుమ తీసుకొచ్చిన శివ లింగానికే ముందు పూజ జరుగుతుందని వరం ఇచ్చాడు. ఇక్కడ ఆంజనేయ స్వామి తీసుకొచ్చిన పెద్ద శివలింగానికి భక్తులు స్వయంగా అభిషేకాలు చేసుకోవచ్చు. శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి ముక్తి రామేశ్వరం క్షేత్రంగా పేరువచ్చింది. అలాగే ఆంజనేయుడు తెచ్చిన శివలింగాన్ని హనుమత్ రామకింగేశ్వర క్షేత్రంగా పేరువచ్చింది. ప్రొద్దుపొడవక ముందే శ్రీరాముడు సైకత లింగం ప్రతిష్టించినందున ఈ ప్రాంతానికి కాలక్రమేణా " ప్రొద్దుటూరు" అని పేరు వచ్చిందని పురాణ కథనం. ఆంజనేయ స్వామి తీసుకొచ్చిన శివ లింగాన్ని కూడా శ్రీరాముడు ప్రతిష్టించినందున ఈ క్షేత్రానికి హనుమత్ రామలింగేశ్వర క్షేత్రం అని పేరు వచ్చింది. ఇక్కడ కాశీ అన్నపూర్ణేశ్వరి కొలువైవుంది. ఇక్కడ అన్నదానం కూడా ఉంది.

## 2026లో సోషల్ మీడియా ఇలా మారిపోతోంది.. మీరు చూస్తున్నదంతా మునుపటిలా ఉండదు!

### పర్ఫెక్ట్ కంటే సహజమైన కంటెంట్‌కు ఆదరణ

### చిన్న క్రియేటర్లకూ వైరల్ అయ్యే అవకాశం

### సోషల్ మీడియాలోనే సమాచారం వెతుకుతున్న యూజర్లు

### ఏఐ కంటే హ్యూమన్ టచ్‌కు పెరుగుతున్న విలువ

### షాపింగ్ నిర్ణయాలపై సోషల్ మీడియా ప్రభావం




సోషల్ మీడియా ప్రతి ఏడాది కొత్తగా మారుతోంది. ఒకప్పుడు అందమైన ఫొటోలు, ట్రెండింగ్ పాటలు, భారీ ఫాలోయింగ్ ఉన్న సెలబ్రిటీలే ఎక్కువగా కనిపించేవారు. ఇప్పుడు పరిస్థితి క్రమంగా మారుతోంది. సాధారణంగా తీసిన వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి. లక్షలాది మంది ఫాలోవర్లు లేకపోయినా చిన్న క్రియేటర్లు పెద్ద ఆడియన్స్‌ను సంపాదించుకుంటున్నారు. అంతేకాదు.. సోషల్ మీడియా ఇప్పుడు కేవలం టైమ్‌పాస్ కోసం చూసే వేదికగా కాకుండా సమాచారం వెతకడానికి, వస్తువులు కొనడానికి, కొత్త ప్రదేశాలు తెలుసుకోవడానికి కూడా ఉపయోగపడుతోంది. 2026లో సోషల్ మీడియాను మార్చుతున్న ఐదు ముఖ్యమైన ట్రెండ్స్ ఇవే.

రియల్ లైఫ్‌కు ప్రాధాన్యం

ప్రతి ఫొటోను పర్ఫెక్ట్‌గా చూపించాలనే ఆలోచన క్రమంగా తగ్గుతోంది. కొంచెం బ్లర్‌గా ఉన్న ఫొటో, ఒక్క టేక్‌లో తీసిన వీడియో, సహజంగా మాట్లాడిన మాటలు కూడా ఇప్పుడు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. మరీ ఎక్కువగా ప్లాన్ చేసిన కంటెంట్ కంటే నిజ జీవితానికి దగ్గరగా కనిపించే పోస్టులకు ఆదరణ పెరుగుతోంది. క్రియేటర్లు తమ జీవితంలోని చిన్న చిన్న లోపాలను కూడా చూపిస్తున్నారు. అంటే సోషల్ మీడియాలో 'పర్ఫెక్ట్ లైఫ్' కంటే 'రియల్ లైఫ్'కు ప్రాధాన్యం పెరుగుతోంది.

లక్షల ఫాలోవర్లు లేకపోయినా..

గతంలో సోషల్ మీడియాలో గుర్తింపు రావాలంటే భారీ ఫాలోయింగ్ ఉండాలి. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. రికమెండేషన్ ఆధారిత ఫీడ్స్ వల్ల చిన్న క్రియేటర్లు కూడా ఒక్క పోస్టుతో వేలాది మందికి చేరుతున్నారు. ఇప్పటికే ఫేమస్ అయిన వ్యక్తుల కంటే కొత్తగా వచ్చినవారికీ వైరల్ అయ్యే అవకాశం పెరిగింది. కొన్నిసార్లు రోజుల తరబడి కష్టపడి తయారు చేసిన వీడియో కంటే సరదాగా తీసిన చిన్న క్లిప్ ఎక్కువగా వైరల్ అవుతోంది.

సోషల్ మీడియాలోనే సమాధానాలు!

రెస్టారెంట్ ఎలా ఉంది? ఏ హోటల్ బాగుంటుంది? ఏ స్కిన్‌కేర్ ప్రొడక్ట్ కొనాలి? జైపూర్‌లో రెండు రోజుల్లో ఏం చూడాలి? ఇలాంటి ప్రశ్నలకు ఇప్పుడు చాలామంది సోషల్ మీడియాలోనే సమాధానాలు వెతుకుతున్నారు. ముఖ్యంగా వీడియోల ద్వారా నిజమైన అనుభవాలు తెలుసుకోవడం ప్రజలకు ఆసక్తిగా మారింది. ఒక రెస్టారెంట్ పేరు తెలుసుకోవడం మాత్రమే కాదు.. అక్కడి వాతావరణం, ఫుడ్, ధరలు ఎలా ఉన్నాయో కూడా వీడియోల్లో చూసి నిర్ణయం తీసుకుంటున్నారు. దీంతో సోషల్ మీడియా క్రమంగా సెర్చ్ ఇంజిన్‌లా మారుతోంది.

ఏఐ కంటెంట్ పెరిగే కొద్దీ..

ఏఐతో ఫొటోలు, వీడియోలు, క్యాప్షన్లు, స్క్రిప్టులు క్షణాల్లో తయారవుతున్నాయి. దీంతో కంటెంట్ తయారు చేయడం చాలా సులభమైంది. కానీ అందరూ ఒకే రకమైన ఏఐ టూల్స్ ఉపయోగిస్తుండటంతో కేవలం అందంగా కనిపించే కంటెంట్ ప్రేక్షకులను ఎక్కువగా ఆకట్టుకోకపోవచ్చు. వ్యక్తిగత అనుభవం, ప్రత్యేకమైన హాస్యం, సహజమైన మాటతీరు, చిన్న చిన్న పొరపాట్లు కంటెంట్‌కు ప్రత్యేకతను ఇస్తున్నాయి. ఏఐ పోస్టును తయారు చేయగలదు.. కానీ దానిపై ఆసక్తి కలిగించే వ్యక్తిత్వాన్ని మాత్రం ఇవ్వలేదు.

**సోషల్ మీడియా నుంచి షాపింగ్ వరకు..**

సోషల్ మీడియాలో చూసిన వస్తువును కొనడం ఇప్పుడు చాలా సాధారణంగా మారుతోంది. ఒకరు వేసుకున్న షూస్ నచ్చితే అవి ఎక్కడ దొరుకుతాయో తెలుసుకుంటున్నారు. ఒక మేకప్ ప్రొడక్ట్ లేదా గ్యాడ్జెట్ ఎలా పనిచేస్తుందో క్రియేటర్ వీడియోలో చూసి కొనుగోలు చేస్తున్నారు. అందుకే క్రియేటర్లు ఇప్పుడు వినోదం అందించడంతో పాటు కొనుగోలు నిర్ణయాలపై కూడా ప్రభావం చూపుతున్నారు. అయితే ప్రతి సిఫార్సు నిజాయతీగా ఉంటుందని భావించకూడదు. వినోదం, ప్రచారం, షాపింగ్.. ఈ మూడింటి మధ్య ఉన్న గీతలు మరింత చెరిగిపోతున్నాయి.

## యూపీలో జడ్జి సంచలనం.. 4 నెలల్లో 22 మందికి మరణశిక్ష!

### యూపీలో ఓ జడ్జి నాలుగు నెలల్లో 22 మందికి ఉరిశిక్ష విధించిన జడ్జి

### ముజఫర్‌నగర్ అదనపు సెషన్స్ జడ్జి రవికుమార్ దివాకర్ తీర్పులు

ఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌కు చెందిన అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కేవలం నాలుగు నెలల కాలంలోనే 10 వేర్వేరు కేసుల్లో 22 మందికి మరణశిక్ష విధించి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. ఈ వరుస తీర్పుల నేపథ్యంలో దేశంలో మరణశిక్షల అమలుపై మరోసారి విస్తృత చర్చ ప్రారంభమైంది. ప్రభుత్వ న్యాయవాది వెల్లడించిన వివరాల ప్రకారం, జడ్జి రవికుమార్ దివాకర్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో ఈ కీలక తీర్పులను వెలువరించారు. న్యాయవాది సమీర్ సఫీ హత్య కేసు, హోంగార్డు హత్య, హైవే దోపిడీ, ఆర్థిక లాభం కోసం కిడ్నాప్ చేసి హత్య చేయడం వంటి అత్యంత క్రూరమైన నేరాల్లో నిందితులకు ఈ కఠిన శిక్షలు ఖరారు చేశారు. ఇందులో భాగంగా ఏప్రిల్‌లో ఏడుగురికి, మే నెలలో ఒకరికి, జూన్‌లో ఇద్దరికి, జూలైలో ఏడుగురికి, ఆగస్టు 13 నాటికి మరో ఐదుగురికి మరణశిక్ష విధించారు. ఇటీవల ఆగస్టు 12న, 1999 నాటి కిడ్నాప్, హత్య కేసులో షానవాజ్‌కు, ఆగస్టు 13న షామ్లీ జిల్లాలో జరిగిన పవన్ కుమార్ హత్య కేసులో నలుగురికి ఉరిశిక్ష విధిస్తూ ఆయన తీర్పునిచ్చారు. జడ్జి దివాకర్ గతంలో బరేలీలో పనిచేస్తున్న సమయంలోనూ 13 మందికి మరణశిక్ష విధించిన చరిత్ర ఉంది. దీంతో ఆయన ఇప్పటివరకు తన పదవీ కాలంలో మొత్తం 35 మందికి మరణశిక్ష విధించినట్లయింది. 2022లో వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో వీడియోగ్రాఫిక్ సర్వేకు ఆదేశాలు జారీ చేసి జడ్జి రవికుమార్ దివాకర్ దేశవ్యాప్త గుర్తింపు పొందారు. అయితే, సెషన్స్ కోర్టు విధించిన మరణశిక్షలు అమలు కావాలంటే నిబంధనల ప్రకారం హైకోర్టు వాటిని ధ్రువీకరించాల్సి ఉంటుంది. అలాగే, ఈ తీర్పులను సవాలు చేస్తూ నిందితులకు సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునే చట్టపరమైన అవకాశం కూడా ఉంటుంది.

## ఇల్లు, పిల్లల చదువుకే రూ.7 లక్షలు.. చైనాలో భారతీయ కుటుంబం ఖర్చు వైరల్!

### షాంఘైలో నెలకు రూ.9.81 లక్షల ఖర్చు

చైనాలో జీవితం అంటే తక్కువ ఖర్చుతోనే సాగిపోతుందని చాలామంది అనుకుంటారు. కానీ షాంఘైలో ఉంటున్న ఓ భారతీయ కుటుంబం నెలవారీ ఖర్చులు మాత్రం అందుకు భిన్నమైన చిత్రాన్ని చూపిస్తున్నాయి. నలుగురు సభ్యులున్న ఆ కుటుంబం నెలకు దాదాపు రూ.9.81 లక్షలు ఖర్చు చేస్తోంది. అద్దె, పిల్లల చదువు, కిరాణా, ఇంటి పనివాళ్లు, వినోదం ఇలా పలు ఖర్చులను ఆ కుటుంబానికి చెందిన అదితి శర్మ సోషల్ మీడియాలో వివరించారు. అదితి శర్మ కుటుంబం షాంఘైలోని ఇంటి అద్దెకు నెలకు 25,000 యువాన్లు చెల్లిస్తోంది. మన కరెన్సీలో ఇది దాదాపు రూ.3.5 లక్షలు. పిల్లలు అంతర్జాతీయ పాఠశాలలో చదువుతున్నారు. వారి చదువుకు కూడా నెలకు మరో 25,000 యువాన్లు, అంటే సుమారు రూ.3.5 లక్షలు ఖర్చవుతున్నాయి. కుటుంబం నెలవారీ బడ్జెట్‌లో ఎక్కువ భాగం ఈ రెండు ఖర్చులకే వెళ్తోంది. కిరాణా సరుకులకు నెలకు దాదాపు 5,000 యువాన్లు ఖర్చవుతున్నాయి. అంటే సుమారు రూ.70,750. ఇంటి పనుల కోసం పెట్టుకున్న సిబ్బందికి నెలకు రూ.లక్షకుపైగా చెల్లిస్తున్నారు. విద్యుత్, నీరు, ఇతర యుటిలిటీ ఖర్చులకు సుమారు రూ.21,230 వెచ్చిస్తున్నారు. ప్రజా రవాణాకు మరో రూ.10 వేల వరకు ఖర్చవుతోంది. పిల్లల వినోదం, అదనపు కార్యక్రమాల కోసం నెలకు మరో 1,500 యువాన్లు ఖర్చు చేస్తున్నారు. బయట తినడం, షాపింగ్‌కు సుమారు 4,000 యువాన్లు, అంటే రూ.56,650 వరకు వెచ్చిస్తున్నారు. ఇలా అన్ని ఖర్చులు కలిపితే నెలకు దాదాపు రూ.9,81,860 అవుతున్నాయని అదితి తెలిపారు. అయితే ఈ మొత్తాన్ని షాంఘైలో ప్రతి కుటుంబానికి వర్తించే ఖర్చుగా చూడొద్దని ఆమె స్పష్టం చేశారు. తమ జీవనశైలి, పిల్లలు చదివే స్కూల్, ఉండే ప్రాంతం, ఇంటి అద్దె ఆధారంగా ఖర్చులు మారుతాయని చెప్పారు. తమకు ఎలాంటి ప్రవాస భత్యం రావడం లేదని, వైద్య బీమా మాత్రం 100 శాతం వైద్య ఖర్చులను కవర్ చేస్తుందని తెలిపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పలువురు స్పందించారు. షాంఘై, బీజింగ్ వంటి పెద్ద నగరాల్లో అద్దెలు, అంతర్జాతీయ పాఠశాలల ఫీజులు భారీగా ఉంటాయని కొందరు పేర్కొన్నారు.

# భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కు ఘన స్వాగతం

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయమునకు చేరుకున్న భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

ఘన స్వాగతం పలికిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర మంత్రులు మంత్రి నారా లోకేష్, కొలుసు పార్థసారథి ఇతర ఉన్నతాధికారులు.








గన్నవరం శ్రీ వార్త న్యూస్: ఏలూరు జిల్లా ముసునూరులో పర్యటన నిమిత్తం సోమవారం ఉదయం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయమునకు చేరుకున్న భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కు ఘన స్వాగతం లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్, రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఇతర ఉన్నతాధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఏలూరు రేంజ్ ఐజి జీవిజి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, రాష్ట్ర ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు, శాసన మండలి సభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్, గుడివాడ శాసనసభ్యుడు వెనిగండ్ల రాము, పెడన శాసనసభ్యుడు కాగిత కృష్ణప్రసాద్, పెనమలూరు శాసనసభ్యుడు బోడె ప్రసాద్, పామర్రు శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా, ఎయిర్పోర్ట్ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి తదితరులు ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక కాన్వాయ్ లో రోడ్డు మార్గాన ఏలూరు జిల్లాకు బయలుదేరి వెళ్లారు.

## నేటి సమాజానికి విలువలతో కూడిన విద్య అవసరం

– ఈడేపల్లిలో శ్రీ సత్యసాయి బాలవికాస్ నూతన కేంద్రం ప్రారంభం



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర అధ్యక్షులు ఆర్. లక్ష్మణరావు సూచనల మేరకు "బ్యాక్ టు బేసిక్" ప్రోగ్రాంలో భాగంగా ఈడేపల్లి కురుమ వీధిలోని శ్రీ అయోధ్య రామ మందిరం, వీరభద్ర దేవాలయంలో శ్రీ సత్యసాయి బాలవికాస్ నూతన కేంద్రాన్ని ప్రారంభించారు. సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ కుమార్, సమన్వయకర్త అనుమకొండ వెంకటేశ్వరరావు, విద్యా విభాగ సమన్వయకర్తలు పి. వరప్రసాద్, పి. కళ్యాణి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గోపాల వెంకటేశ్వరరావు, సుభాష్ చంద్రబోస్, సాయిబాబు శివశంకర్, కుమ్మరి జలాచంద్రుడు, హర్ష సత్యనారాయణ, గౌర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనుమకొండ వెంకటేశ్వరరావు బాలవికాస్ విశిష్టతను వివరించారు. కన్వీనర్ మాట్లాడుతూ ప్రతి ఆదివారం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు 5 నుంచి 10 సంవత్సరాల బాలబాలికలకు మానవతా విలువలతో కూడిన తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యా విభాగ సమన్వయకర్తలు ఆటపాటల కార్యక్రమం నిర్వహించారు. ఈ సెంటర్ సమన్వయకర్తలుగా దేవి అనుపమ, టి. వెంకటలక్ష్మిలను నియమించారు. ఆలయ కమిటీ సభ్యులు సత్యసాయి సేవా సమితి సభ్యులను ప్రశంసించారు. కార్యక్రమంలో ఎం.బి. రామ్మూర్తి, వై. రాజమోహన్, ఎస్. వెంకట చెన్నయ్య గుప్తా, మల్లంపల్లి శ్రీనివాసరావు, కొట్టే నాగమణి, బాలబాలికలు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు మెరుగైన సేవలు అందించాలని మార్కెట్ యార్డ్ చైర్మన్‌ను కోరిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ధన్వంతరి ఆచార్య

మచిలీపట్నం మార్కెట్ యార్డ్‌లో మర్యాదపూర్వక భేటీ



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ : మచిలీపట్నం మార్కెట్ యార్డ్‌ను పట్టణ ప్రముఖులు, సీనియర్ వైద్యులు డాక్టర్ ధర్మంతా చారి సందర్శించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నానిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలని, రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రైతులకు అందుతున్న సౌకర్యాలపై చైర్మన్‌తో చర్చించారు.

## ఎమ్మెల్సీ వర్ల రామయ్యకు శుభాకాంక్షలు తెలిపిన కృష్ణాజిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ




అమరావతి శ్రీ వార్త న్యూస్: మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో ఇటీవల శాసనమండలి సభ్యులుగా నియమితులైన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్యను కృష్ణా జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల టీడీపీ అధ్యక్షులు గోపీ నాగబాబు, కృష్ణా జిల్లా టీడీపీ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్, శీలం కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్. ఎస్. అర్. ఆంజనేయులు సోదరి జన్మదినం సందర్భంగా ప్రొద్దుటూరులో ఘనంగా పూజలు



ప్రొద్దుటూరు (కడప జిల్లా ) ఆగస్టు 24 : (శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధి ): సీనియర్ పాత్రికేయులు, ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. అర్. ఆంజనేయులు సోదరి ఆరిమండ్ల అంజనీ దేవి 76 వ జన్మదిన వేడుకలు కడప జిల్లా ప్రొద్దుటూరు టౌన్లో కుటుంబ సభ్యుల మధ్య ఏంతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సీనియర్ పాత్రికేయులు, ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు, శ్రీమతి జానకీ లక్ష్మి దంపతులు హాజరైనారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు రామేశ్వరంలో స్వయంభు శ్రీ రామచంద్రుడు ప్రతిష్టించిన "సైకిత లింగం " దర్శించి ఘనంగా వారు పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ రాజ రాజేశ్వరీ దేవిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కాశీ నుండి ఆంజనేయ స్వామి తీసుకొనివచ్చిన "భారీ శివలింగానికి" వారు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఇక్కడ వేంచేసియున్న శ్రీ కాశీ అన్నపూర్ణా దేవిని దర్శించి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనములు అందించి స్వామి అమ్మవారి ప్రసాదాన్ని అందచేశారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు, ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. అర్. ఆంజనేయులు మాట్లాడుతూ తాము కడప జిల్లా వచ్చినపుడు ఇక్కడ వున్న స్వయంభూ దేవాలయాలను దర్శిస్తామని చెప్పారు. అర్చక స్వాములు తమకు ప్రత్యేక పూజలు చేయడం పట్ల ఎస్. ఎస్. అర్. ఆంజనేయులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ వైష్ణవ సేవ సమితి ప్రారంభం..

తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో బ్రాహ్మణులకూ అవకాశం

బ్రాహ్మణులకు అండగా నిలుస్తాం - డా హరి ప్రసాద్

(ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు)



తిరుపతి, ఆగస్టు 24 : (శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధి ): తిరుపతి లో స్థానిక బ్రాహ్మణ యువత శ్రీ వైష్ణవ బ్రాహ్మణ సేవ సమితి సంస్థ ను ఆరంభించారు, గౌరవ సలహాదారుగా సంస్కార్ రాజేష్, బాలాజీ, అధ్యక్షులు గా పూజారి రఘు, పృథ్వింటి సురేంద్ర ఎన్నికయ్యారు. సంస్థ కార్యాలయం ను ఏపీ హ్యాండీ కాఫ్ట్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్ ఆన్లైన్ మాధ్యమం ద్వారా పాల్గొని బ్రాహ్మణులకు ఈ సారి కార్పొరేషన్ ఎన్నికలలో 4 సీట్లు ఇస్తునట్లు చెప్పారు. బ్రాహ్మణులు సంఘటితంగా కలిసి పనిచేయాలని ప్రభుత్వం పూర్తి సహకారం ఇస్తుందని హామీ ఇచ్చారు సంస్థను ప్రారంభించిన డా. పసుపులేటి హరి ప్రసాద్ మాట్లాడుతూ తాను కర్మతః బ్రాహ్మణుడినని, బ్రాహ్మణుల కోసం జనసేన తరుపున తాను సహకారం అందిస్తానని సంస్థ ప్రతినిధులకు బరోసా ఇస్తూ వారిని అభినందించారు. బీజేపీ పార్టీ నుండి తాను రాష్ట్ర స్థాయిలో బ్రాహ్మణులకు అండ గా నిలుస్తామని జల్లి మధుసూదన్ పేర్కొన్నారు. గౌరవ సలహాదారులు సంస్కార్ రాజేష్ మాట్లాడుతూ బ్రాహ్మణులకు సంబంధించిన పలు సమస్యలను డా. పసుపులేటి హరి ప్రసాద్ మధు సూధన్ దృష్టి కి తీసుకొచ్చారు. ఇందుకు వారు స్పందిస్తూ బ్రాహ్మణ సమస్యలకు పరిష్కారం దిశగా అడుగులు వేస్తాం అని పేర్కొన్నారు. పోటు ఉద్యోగులకు ఫ్రీ ఓపీ ఇస్తున్నట్టు, ఆపరేషన్ కు సర్జరీ కాస్ట్ మాత్రమే తీసుకున్నట్టు పసుపులేటి హరి ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ గొర్తి శ్రీనివాస్, ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అనంత ప్రసాద్, వైష్ణవ బ్రాహ్మణ సేవ సమితి నాయకులు పూజారి రఘు సురేంద్ర, పోటు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సునీల్, శంకర్, బాలాజీ తదితరుల పాల్గొన్నారు.

## మచిలీపట్నం కార్పొరేషన్ మేయర్ పదవి బీజేపీకి కేటాయించాలి

ఎన్డీఏ కూటమి మిత్రధర్మం పాటించాలని బీజేపీ నేతల డిమాండ్



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ : కృష్ణాజిల్లా బీజేపీ అధ్యక్షులు తాతినేని శ్రీరామ్ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో మచిలీపట్నం నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. త్వరలో జరగనున్న మచిలీపట్నం కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక నాయకులతో విస్తృతంగా చర్చించారు. ఎన్డీఏ కూటమిలో భాగంగా మచిలీపట్నం కార్పొరేషన్ మేయర్ పదవిని బీజేపీకి కేటాయించాలని స్థానిక సీనియర్ నాయకులు జిల్లా అధ్యక్షుడిని కోరారు. కూటమిలో భాగస్వామ్య పార్టీలైన టీడీపీకి మంత్రి పదవి, జనసేనకు ఎంపీ పదవి లభించిన నేపథ్యంలో మిత్రధర్మాన్ని పాటిస్తూ మేయర్ పదవిని బీజేపీకి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు తాతినేని శ్రీరామ్ మాట్లాడుతూ చారిత్రక ప్రాధాన్యత కలిగిన మచిలీపట్నం కార్పొరేషన్ మేయర్ పదవిని బీజేపీకి కేటాయించే విషయంపై రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తో చర్చిస్తానని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ డివిజన్లలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి గుత్తికొండ రాజబాబు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్రరావు, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలమచర్ల పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## నాగాయలంక మండలంలో దుర్వినియోగమైన 55 డ్వాక్రా సంఘాల రూ. 74 లక్షల నిధులు

రెవెన్యూ రికవరీ యాక్ట్ 1864 ద్వారా వసూలు చేయాలని కలెక్టర్‌కు ఆర్టీఐ కార్యకర్తల వినతి



కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్: కృష్ణా జిల్లా నాగాయలంక మండలంలో దుర్వినియోగానికి గురైన 55 డ్వాక్రా సంఘాల నిధులు రూ. 74 లక్షల 24 వేల 156 లను రెవెన్యూ రికవరీ యాక్ట్ - 1864 ద్వారా వసూలు చేయాలని యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఆర్టీఐ క్యాంపెయిన్ ప్రతినిధులు కృష్ణాజిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ ఉత్తర్వులు ప్రకారం ఈ నిధుల వసూలు చేయాలని కోరారు. ఆర్టీఐ కార్యకర్తలు జంపాన శ్రీనివాస గౌడ్, బేతపూడి జోగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం నాగాయలంక మండలం, నాగాయలంక సి.సి. క్లస్టర్ లోని శ్రీ దుర్గా గ్రామైక్య సంఘం బుక్ కీపర్ కన్నెగంటి వెంకట రమణ దుర్వినియోగం చేసిన డ్వాక్రా గ్రూపుల నిధులు రూ. 52 లక్షల 74 వేల 601, అలాగే వక్కపట్లవారి పాలెంలోని త్రివేణి గ్రామైక్య సంఘం నిధులను దుర్వినియోగం చేసిన బుక్ కీపర్ గాజులేటి శాలిని నుండి రూ. 21 లక్షల 50 వేల 555 వసూలు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

## ఎస్. ఎస్. ఆర్. కుటుంబ సభ్యులకు అర్చకుల వేద ఆశీర్వచనం




ప్రొద్దుటూరు, ఆగస్టు 24 : (శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధి ): సీనియర్ పాత్రికేయులు, అధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు తన కుటుంబ సభ్యులతో సహా సోమవారం ఉదయం కడపజిల్లా లోని ప్రొద్దుటూరు టౌన్లో వున్న ప్రాచీన స్వయంభూ శ్రీ రామ చంద్రుడు ప్రతిష్టించిన "సైకిత లింగం ", శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారిని, శ్రీ ఆంజనేయ స్వామి కాశీ నుండి తెచ్చిన భారీ శివలింగం దర్శించారు. శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి అమ్మవారిని దర్శించారు. సోమవారం విశేషంగా అభిషేకం నిర్వహించారు. అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చక స్వాములు శివ, రాజశేఖర్ తదితరులు ప్రత్యేకంగా వారికి పూజలు నిర్వహించారు. ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు, శ్రీమతి జానకీ లక్ష్మి, ఆరిమండ్ల అంజనీ దేవి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అనుబంధం పై అవగాహన






ఘంటసాల, శ్రీవార్త న్యూస్ : గన్నవరం సబ్ డివిజన్ కు చెందిన రైతులు విజ్ఞాన యాత్రలోని సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ అనుబంధశీపై అవగాహన సమన్వయకర్త డాక్టర్ సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం విధుల, పనితీరు కేంద్రంలో విత్తన ఉత్పత్తి, శిక్షణ, క్షేత్ర స్థాయి పరిశోధనలు, ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాల వివరాలు, ప్రస్తుత కాలంలో ఎల్ నినో ప్రభావం వలన సాగులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపారు. రైతులు కేవీకేలోని ఇన్‌స్ట్రక్షనల్ ఫామ్, వివిధ ప్రదర్శనా యూనిట్లు వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలను పరిశీలించి, వాటి ద్వారా పొందే ప్రయోజనాలను తెలుసుకున్నారు. రైతుల సందేహాలకు కేవీకే శాస్త్రవేత్తలు సమాధానాలు అందిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం స్థిరమైన వ్యవసాయ విధానాలను ప్రోత్సహించడం కేవీకే ప్రధాన లక్ష్యమని తెలిపారు. కేవికే శాస్త్రవేత్తలు డా. వెంకట లక్ష్మి, డా.రేవతి, డా. నవీన్, యశ్వంత్ కుమార్, గన్నవరం ఏడిఏ సునీల్, మండల వ్యవసాయ అధికారులు శ్రీనివాస్, శైలజ, గణేశ్ రెడ్డి, ఏఇఓ, విఏఏలు రైతులు పాల్గొన్నారు.

## నాకు తెలుగు అర్థమవుతుంది: ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

ముసునూరులో పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని ఆవిష్కరించిన రాధాకృష్ణన్

తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన రాధాకృష్ణన్

నదుల అనుసంధానం వాస్తవ రూపం దాలుస్తుందని ఆశాభావం



ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గ పరిధిలోని ముసునూరులో నాన్-జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సీఎం చంద్రబాబుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించి సభలోని వారిని అలరించారు. తనకు తెలుగు అర్థమవుతుందని.. కానీ స్పష్టంగా మాట్లాడలేనని చెప్పారు. మన దేశంలో జనవరి 14న సంక్రాంతి పంటల పండుగను విభిన్న పేర్లతో కలిసికట్టుగా జరుపుకుంటామని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణల్లో సంక్రాంతిగా, తమిళనాడులో పొంగల్‌గా, పంజాబ్‌లో లోహ్రీగా, అసోంలో బిహూగా పిలుచుకుంటామని గుర్తుచేశారు. దేశంలో 8 రాష్ట్రాల్లో 17,500 మంది రైతులు దాదాపు 40 వేల ఎకరాల్లో పాప్‌కార్న్ మొక్కజొన్నను పండించడం అభినందనీయమన్నారు. అమెరికా నుంచి పాప్‌కార్న్ దిగుమతి చేసుకోవడం మానేసి, మనమే అక్కడికి ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. రైతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని చెప్పారు. డ్రోన్లను రైతులకు అద్దెకు ఇచ్చే పథకం కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 1,200 కోట్లను మహిళా సంఘాలకు కేటాయించిందని వివరించారు. మహానది నుంచి కావేరి నది వరకు నదుల అనుసంధానం కేవలం కలగానే మిగిలిపోదని, కొంత సమయం పట్టినా భవిష్యత్తులో తప్పకుండా వాస్తవ రూపం దాలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## హైదరాబాద్ నుంచి ఏపీకి అక్రమంగా చికెన్ వ్యర్థాల తరలింపు.. 100 టన్నులు సీజ్

చికెన్ వ్యర్థాల తరలింపును అడ్డుకున్న అధికారులు

ఏపీలోని చేపల చెరువులకు చికెన్ వ్యర్థాల తరలింపు

పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన సైబరాబాద్ పోలీసులు



హైదరాబాద్ : హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న భారీ చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాను అధికారులు అడ్డుకున్నారు. ఏపీలోని చేపల చెరువులకు దాణాగా వేసేందుకు అక్రమ మార్గంలో తరలిస్తున్న దాదాపు 100 టన్నుల మాంసపు వ్యర్థాలను సైబరాబాద్ పోలీసులు, వెటర్నరీ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో సీజ్ చేశారు. నగరంలోని వివిధ కోళ్ల దుకాణాలు, మాంసం ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి వెలువడే వ్యర్థాలను కొందరు అక్రమార్కులు సేకరించి, లారీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని చేపల చెరువులకు తరలిస్తున్నారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన సైబరాబాద్ పోలీసులు, పశువైద్య అధికారులు వాహనాలను తనిఖీ చేసి ఈ 100 టన్నుల వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి అపరిశుభ్రమైన, ప్రమాదకరమైన చికెన్ వ్యర్థాలను మేతగా వేసి పెంచిన చేపలను వినియోగించడం వల్ల ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని అధికారులు హెచ్చరించారు. ఈ తరహా కలుషిత చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల పలు రకాల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ అక్రమ రవాణాదారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001